RNI NO : TELTEL/2023/89146

Telugu Daily

# శెనార్తి మీడియా

మన యాసే.. మన బలం

తెలుగుదినపత్రిక | సంపుటి :3 | సంచిక:225 | గురువారం | 24 సెప్టెంబర్ 2026 | పేజీలు :8 | వెల రూ.5

Published from : Karimnagar Circulated to : Adilabad, Warangal, Hyderabad, Khammam, Nalgonda, Mahbubnagar, Medak, Nizambad, Rangareddy

రిపోర్టర్లు కావలెను

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి

శెనార్తి మీడియా

ఆహ్వానం పలుకుతుంది

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిలో రిపోర్టర్లుగా పని చేసేందుకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లలో సంప్రదించగలరు.

77309 83966 98491 98098




## రెండు డీఏలు ఇచ్చేందుకు అంగీకారం

- ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 :**

రెండు డీఏలు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీకరించింది. ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో ప్రభుత్వ ప్రధాన మిగతా 2వ పేజీలో..



## 25న గణేశ నిమజ్జనోత్సవం

## ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనాలు జరగాలి

- భారీ బందోబస్తు.. సమన్వయంతో ఏర్పాట్లు
- డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలి



## కాంగ్రెస్ పాలనలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం

- బొగ్గు కొరత.. ప్లాంట్ల మూత.. రైతులకు కష్టాలు
- జెన్‌కోకు సింగరేణి నాసిరకం బొగ్గు
- రూ.2,900 కోట్ల నష్టం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపణ




## మా భూముల హద్దులు నిర్ధారించాలి

- కలెక్టర్ కార్యాలయంలో అధికారులకు రైతుల వినతిపత్రం
- కలకలం రేపుతోన్న ఎర్రవల్లి భూ సర్వే వివాదం

**మర్కుక్, సెప్టెంబర్ 23 :**

సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలంలో భూ వివాదం కలకలం రేపుతోంది. అధికారులు ఇచ్చిన పట్టాదార్ పాస్ పుస్తకాల ప్రకారం కాకుండా వేరే సర్వే నంబర్ల పేరుతో వచ్చి భూములు కొలుస్తున్నారంటూ శివారు వెంకటాపూర్ గ్రామానికి చెందిన రైతులు మిగతా 2వ పేజీలో..





# చరిత్రాత్మక ఘట్టం కానున్న సమ్మిట్

- రాష్ట్ర భవిష్యత్తు, ఆర్థిక ప్రగతి కొత్త శిఖరాలకు
- ప్రతిష్ఠాత్మకంగా 'గ్లోబల్ సమ్మిట్' ఏర్పాట్లు చేపట్టాలి
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- దేశ, విదేశాల్లో రోడ్‌షోలు.. వార్‌రూమ్ ద్వారా పర్యవేక్షణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 :**

రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా 2026 డిసెంబర్ 7 నుంచి 9 వరకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 ఏర్పాట్లను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. తెలంగాణ భవిష్యత్తును, రాష్ట్ర ఆర్థిక ప్రగతిని కొత్త శిఖరాలకు చేర్చే ఈ చరిత్రాత్మక ఘట్టంలో అధికారులంతా భాగస్వాములై దిగ్విజయం చేయాలి అని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని ప్రపంచ పెట్టుబడుల గమ్యస్థానంగా మార్చేందుకు నిర్వహించనున్న ఈ గ్లోబల్ సదస్సు ఏర్పాట్లను పక్కాగా పూర్తి చేయాలని దిశా నిర్దేశం చేశారు. సచివాలయంలో బుధవారం జరిగిన సన్నాహక సమావేశంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, అజారుద్దీన్, అడ్లూరి మిగతా 2వ పేజీలో..

## 'మహానది', కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనాలి

- సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు
- జీ9 బొగ్గు లేకనే యాదాద్రిలో పూర్తిస్థాయి ఉత్పత్తి లేదు



## అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు

- రెడ్ అలర్ట్ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
- కలెక్టర్లకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి ఆదేశాలు



## బీజేపీలో కీలక సంస్థాగత మార్పులు

- 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇన్‌ఛార్జ్‌లు, సహ ఇన్‌ఛార్జ్‌లు
- తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌కు సునీల్ బన్సల్
- హరియాణా, ఛత్తీస్‌గఢ్‌కు స్మృతి ఇరానీ
- తమిళనాడు, ఉత్తరాఖండ్ బాధ్యతలు రామ్ మాధవ్‌కు




## రైతు కన్నీటిలో ఓట్లు వెతకడమా?

- కరవుపై బీఆర్ఎస్ నీచ రాజకీయం
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ఆగ్రహం
- నీటి కోసం కర్ణాటక సీఎంతో మంతనాలు... సానుకూల స్పందన
- పంటను కాపాడతాం.. వేసవిలో నీటి ఎద్దడి రానివ్వం
- నేరేడుచర్లలో రూ.26.93 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం



**నేరేడుచర్ల, సెప్టెంబర్ 23 :**

ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న వేళ రైతులకు భరోసా కల్పించాల్సిన ప్రధాన ప్రతిపక్షం కరవు రావాలని, పంటలు ఎండిపోవాలని కోరుకుంటూ పైశాచికానందం పొందేందుకు ప్రయత్నిస్తోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి బీఆర్ఎస్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రకృతి కారణంగా ఏర్పడిన వర్షపాత లోటును కూడా కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంగా చిత్రీకరిస్తూ ఆ పార్టీ నేతలు చేస్తున్న దుష్ప్రచారాన్ని దుయ్యబట్టారు. రైతుల కష్టాన్ని రాజకీయ పెట్టుబడిగా మార్చుకోవడం బాధ్యతాయుతమైన మిగతా 2వ పేజీలో..



## శిశువుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

- ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ ప్రకటన

## డ్రగ్స్‌పై పోరాటం ఇంటి నుంచే ప్రారంభం




- ప్రభుత్వం, పోలీసులకే బాధ్యత పరిమితం కాదు: గవర్నర్ శివప్రతాప్ శుక్లా
- కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి ఉద్యమంగా మార్చాలి
- విద్యార్థులతో యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞ, డిక్లరేషన్‌కు సూచన
- వ్యసన బాధితులకు కౌన్సెలింగ్, పునరావాసం కల్పించాలి

## డిజిటల్ గవర్నెన్స్‌లో రోల్ మోడల్‌గా తెలంగాణ




- ఇంటి ముంగిటకే 'మీ సేవ' సేవలు
- తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో అమలు
- 'మీ సేవ డోర్ డెలివరీ సర్వీసెస్' ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు

# అల్పపీడనం ప్రభావంతో భారీ వర్షాలు

**హైదరాబాద్, సెప్టెంబర్ 23:**

రాష్ట్రంలో మరో రెండు రోజులపాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ జిల్లాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, అవసరమైనచోట ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతి జిల్లాలో 24 గంటలూ అందుబాటులో ఉండే కంట్రోల్ రూమ్, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేసి ప్రజలకు తక్షణ సహాయం అందించాలని కలెక్టర్లను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని, వాగులు, చెరువులు, వరద ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని మంత్రి విజ్ఞప్తి చేశారు.

# శిశువుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 :**

ఆదిలాబాద్ రిమ్స్‌లో జరిగిన అగ్ని ప్రమాద ఘటనలో మృతి చెందిన పిల్లల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియాను అందించనున్నట్టు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ బుధవారం ప్రకటించారు. ఆదిలాబాద్‌లోని వివిధ హాస్పిటళ్లలో చికిత్స పొందుతున్న శిశువుల ఆరోగ్య పరిస్థితిని మంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే వారిని హైదరాబాద్‌లోని పెద్ద హాస్పిటల్స్‌కు తరలించి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. రిమ్స్‌లో 150 బెడ్ల మాతా శిశు ఆరోగ్య కేంద్ర నిర్మాణానికి యుద్ధప్రాతిపదికన పనులు మొదలు పెట్టబోతున్నామని మంత్రి వెల్లడించారు. అత్యాధునిక వసతులతో ఎంసీహెచ్‌ను వీలైనంత త్వరగా అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కాగా, రివమ్స్‌లో జరిగిన అగ్నిప్రమాద ఘటనలో మృతిచెందిన శిశువల సంఖ్య 5కు చేరింది. మంగళవారం జరిగిన ప్రమాదంలో ముగ్గురు చనిపోగా చికిత్స పొందుతూ బుధవారం మరో ఇద్దరు మృతిచెందారు. మరో ఇద్దరు శిశువుల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై విచారణకు ఇప్పటికే అయిదుగురు సభ్యులతో కూడిన కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

# రెండు డీఏలు ఇచ్చేందుకు అంగీకారం

మొదటిపేజీ తరువాయి

కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయంలో బుధవారం సమావేశమయ్యారు. ఈ నెలాఖరు నాటికి పీఆర్‌సీ నివేదిక వచ్చే అవకాశం ఉందని సీఎస్ చెప్పినట్టు సమాచారం. సమావేశం అనంతరం ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ తాము మూడు డీఏలు ఇవ్వాలని అడిగామని, ప్రభుత్వం రెండు డీఏలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని చెప్పారు. 3.46 శాతంతో ఒక డీఏను ప్రభుత్వం ప్రకటించగా రెండో డీఏను 2.74 శాతంతో ఇచ్చేందుకు అంగీకారం తెలిపిందన్నారు. మూడో డీఏను మ□డునాలుగు నెలల్లో ఇస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. 'పీఆర్‌సీ నివేదిక రాగానే చర్యలు తీసుకుంటామన్నారు.. సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్ అమలు అధ్యయనానికి ఉద్యోగ సంఘాల నేతలు, అధికారులతో కమిటీ వేస్తామన్నారు.. కమిటీ వివిధ రాష్ట్రాల్లో పర్యటించి నివేదిక ఇవ్వనుంది అని ఉద్యోగ సంఘాల నేతలు వివరించారు. పీఆర్సీ కమిషన్ గడువును పొడిగించకుండా నివేదిక అందేలా చూడాలని ప్రభుత్వానికి ఉద్యోగ సంఘాలు విజ్ఞప్తి చేశాయి. డీఏ, పీఆర్సీ విషయంలో ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

# మా భూముల హద్దులు నిర్ధారించాలి

మొదటిపేజీ తరువాయి


తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పాస్ పుస్తకాలు ఉన్న తమ భూములకు హద్దులు నిర్ధారించి న్యాయం చేయాలని కోరుతూ ఎంఆర్‌వో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం, రికార్డుల వ్యత్యాసం వల్ల దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములను కోల్పోవాల్సి వస్తోందని ఆరోపించారు. శివారు వెంకటాపుర్ గ్రామానికి చెందిన సర్వే నంబర్లు 41,85,88,77,100 లలో తమకు అధికారికంగా ధరణి పాస్ పుస్తకాలు, అలాగే పూర్వపు ఇందిరమ్మ పట్టాలు ఉన్నాయని రైతులు స్పష్టం చేశారు. కానీ అధికారులు ఎర్రవల్లి శివారుకు చెందిన సర్వే నంబర్ 325తో తమ భూములకు సంబంధం ముడిపెట్టి తమను వెళ్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని వారు వాపోతున్నారు. ముందస్తు నోటీసులు లేకుండా వచ్చి సర్వే నిర్వహించడాన్ని సర్వే అధికారులను అడ్డుకుని నిరసన తెలిపారు. 'మాకు అధికారులే 41 సర్వే నంబర్ల పట్టా పాస్ పుస్తకాలు ఇచ్చారు.. మేము 41 లోనే వ్యవసాయం చేసుకుంటున్నాం.. ఇప్పుడు వచ్చి మమ్మల్ని వెళ్లగొట్టి కొలుస్తామంటే ఎట్లా.. సిఎం రేవంత్ రెడ్డి స్పందించి రికార్డుల ప్రకారం సర్వే చేయించి మాకు న్యాయం చేయాలని వేడుకుంటున్నాం' అన్నారు. సర్వే నంబర్లు 41, 85, 88, 77, 100 లను తీసుకెళ్లి 325 సర్వే నంబర్‌లో కలిపేశారు. గుర్రాల సూరయ్య, దర్శనాల చంద్రయ్య, కుమార్‌లకు ధరణి పాస్ పుస్తకాలు ఉన్నా కూడా మాకు నోటీసులు ఇవ్వకుండా కొలవడానికి వచ్చారన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శివారు వెంకటపూర్ రైతులు అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఎమ్మార్వో కార్యాలయంలో ఎమ్మార్వో సరితకు వినతి పత్రం అందజేశారు. వెంటనే చర్యలు తీసుకుని మా శివారు హద్దులు నిర్ధారించి మాకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

# 25న గణేశ నిమజ్జనోత్సవం

- **ఐదు జిల్లాలకు సెలవు ప్రకటించిన ప్రభుత్వం**

**హైదరాబాద్ సెప్టెంబర్ 23 :**

వినాయక నిమజ్జనం సందర్భంగా ఈనెల 25న సెలవు ప్రకటిస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈ మేరకు అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం వినాయన నిమజ్జనాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ - సికింద్రాబాద్ జంట నగరాలతోపాటు రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం సాధారణ సెలవు ప్రకటించింది. ఈ సెలవుకు బదులుగా నవంబర్ 14న పని దినంగా పరిగణించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది



# చరిత్రాత్మక ఘట్టం కానున్న 'సమ్మిట్'

మొదటిపేజీ తరువాయి

లక్ష్మణ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాట్లు, ప్రచారం, రోడ్‌షోల నిర్వహణపై డిప్యూటీ సీఎం కార్యాచరణను ఖరారు చేశారు. భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇది ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిర్వహిస్తున్న రెండో ప్రపంచ సదస్సు అని, దీని ద్వారా రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బలమైన పునాదులు వేయాలని పిలుపునిచ్చారు. సదస్సు నిర్వహణ పర్యవేక్షణకు దాదాపు పది ప్రత్యేక అధికారుల కమిటీలను ఏర్పాటు చేశామని, ప్రతి కమిటీకి ఒక సీనియర్ అధికారి నేతృత్వం వహిస్తారని వెల్లడించారు. పనుల రూపకల్పన, బడ్జెట్ అంచనాలు, ఆమోదాల ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం జరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అధికారుల కమిటీలతోపాటు ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసి వాటికి సంబంధిత మంత్రులను చైర్‌పర్సన్లుగా నియమించినట్లు తెలిపారు. ప్రతి కమిటీకి కన్వీనర్లను కూడా నియమించామని, వారు వెంటనే సంబంధిత మంత్రులను కలిసి బాధ్యతలు స్వీకరించి పనులు ప్రారంభించాలని సూచించారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకుంటూ ప్రతిరోజూ కార్యక్రమాలు జరిగేలా చూడాలన్నారు. ఈ గ్లోబల్ సమ్మిట్‌ను ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేసేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్, సోషల్ మీడియా వేదికలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సూచించారు. ఈ రోజు నుంచే ప్రతి రోజూ సదస్సుకు సంబంధించిన ఏదో ఒక వార్త మారుమోగాలి.. ప్రచారానికి ఆకాశమే హద్దుగా పనిచేసి అధిక సంఖ్యలో అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు హాజరయ్యేలా చూడాలి అని అధికారులకు స్పష్టం చేశారు.

**3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థే ధ్యేయం**

2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న బృహత్తర లక్ష్యంలో ఈ సమ్మిట్ కీలక మైలురాయి కానుందని పేర్కొన్నారు. గతంలో కుదిరిన ఎంవోయూలను కూడా సమీక్షించి వాటి అమలు పురోగతిని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి, ఆర్థిక ప్రగతికి ప్రతి అధికారి భాగస్వామి కావాలని సూచించారు. సదస్సు ఏర్పాట్లను కేవలం ఒక కార్యక్రమంగా కాక రాష్ట్రానికి దీర్ఘకాలికంగా ఉపయోగపడే ఆస్తిగా తీర్చిదిద్దాలన్నారు. తెలంగాణకు పెట్టుబడులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్న దేశాలు, నగరాలు, రంగాలను గుర్తించి దేశీయ, అంతర్జాతీయ రోడ్‌షోలు నిర్వహించేందుకు స్పష్టమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సూచించారు. ఏ దేశంలో ఏ రంగంలో పెట్టుబడులకు అవకాశాలున్నాయో అధ్యయనం చేసి దానికి అనుగుణంగా రోడ్‌షోల ప్రణాళిక రూపొందించి మంత్రిమండలి ఉపసంఘానికి నివేదించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కార్యాచరణను ఖరారు చేసి రోడ్‌షోలను ప్రారంభించాలన్నారు. అధికారులు వెంటనే తమ టీమ్‌లతో సమావేశమై వార్ రూమ్ ద్వారా పనులను పర్యవేక్షించాలని, రోజూ సాయంత్రం పనుల పురోగతిని తనిఖీ చేసిన తర్వాతే రోజువారీ బాధ్యతలు ముగించాలని భట్టి చెప్పారు.

**రాష్ట్ర సంస్కృతి, విశిష్టత ప్రతిబింబించాలి**

**– ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు**

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 కేవలం పెట్టుబడుల సమీకరణకే పరిమితం కాకుండా తెలంగాణ సంప్రదాయాలు, సాంస్కృతిక విశిష్టతలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఉండాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. బతుకమ్మ పండుగ ప్రాశస్త్యం, తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలు, ఇక్కడి ప్రత్యేక వంటకాలు ఈ ఈవెంట్‌లో ప్రధానంగా ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారి హరిచందనకు సూచించారు. బతుకమ్మ వంటి పండుగల నిర్వహణ మనకు కొత్తేమీ కాదని, గతంలోనూ సమర్థవంతంగా నిర్వహించామని గుర్తు చేస్తూ సాంస్కృతిక శాఖ సమన్వయంతో మరింత అద్భుతంగా తీర్చిదిద్దాలని ఆయన ఆదేశించారు. హోటళ్ల వాతావరణం అంతర్జాతీయ, జాతీయ అతిథులకు అంత ప్రత్యేకంగా అనిపించకపోవచ్చని, అందువల్ల ఇక్కడి సాంస్కృతిక వైభవాన్ని ప్రదర్శించడానికి ఇదొక అద్భుత అవకాశమని పేర్కొన్నారు. రాష్టం నుంచే కాక ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి దాదాపు 2,000 నుండి 3,000 మంది ప్రతినిధులు హాజరుకానున్న నేపథ్యంలో వారికి మన సంస్కృతి ఒక దృశ్య కావ్యంగా నిలిచిపోవాలని అభిప్రాయపడ్డారు. దిల్లీలో జరిగిన జి20, బ్రిక్స్ సమ్మిట్‌ల తరహాలోనే సాయంత్రం వేళల్లో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలు మన వారసత్వాన్ని సమున్నతంగా చాటిచెప్పేలా ప్లాన్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు.

# 'మహానది', కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనాలి

- **సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలు**
- **జీ9 బొగ్గు లేకనే యాదాద్రిలో పూర్తిస్థాయి ఉత్పత్తి లేదు**
- **విద్యుత్ శాఖపై ఎంసీఆర్ హెచఆర్డీలో సమీక్ష**

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 :**

రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న విద్యుత్ అవసరాల దృష్ట్యా మహానది కోల్ ఫీల్డ్స్, కోల్ ఇండియా నుంచి బొగ్గు కొనుగోలుకు చర్యలు ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలు అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖపై ఎంసీఆర్ హెచఆర్డీలో బుధవారం సమీక్ష నిర్వహించారు. యాదాద్రి థర్మల్ కేంద్రంలో పూర్తిస్థాయి విద్యుత్ ఉత్పత్తి చేయకపోవడంపై అధికారులను సీఎం, డిప్యూటీ సీఎంలు ప్రశ్నించారు. ఈ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తికి జీ9 బొగ్గు అవసరమని, సింగరేణిలో జీ9 బొగ్గు ఉత్పత్తి చేసే బ్లాకులు లేవని, సమీప భవిష్యత్తులోనూ సింగరేణి నుంచి జీ9 బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం లేదని అధికారులు తెలిపారు. జీ9 బొగ్గు లభ్యత లేనప్పుడు ఆ సాంకేతికతతో యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని ఎలా నిర్మించారని రేవంత్, భట్టి ప్రశ్నించారు. పిట్ హెడ్ (బొగ్గు గనులపైనే విద్యుత్ కేంద్ర నిర్మాణం) కాకుండా దూరంగా ఎందుకు యాదాద్రి థర్మల్ కేంద్రం నిర్మించారని, దానికి బొగ్గు సరఫరాతో రాష్ట్రంపై పడే అదనపు భారం ఎంత అని అధికారులను అడిగారు. ఆనాడు రాజకీయ కారణాలతోనే పిట్ హెడ్‌పై కాకుండా దూరంగా యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం నిర్మించారంటూ యాదాద్రికి బొగ్గు సరఫరాతో రాష్ట్రంపై రూ.40 వేల కోట్ల అదనపు భారం పడుతోందని అధికారులు సమాధానమిచ్చారు. సింగరేణి నుంచి జీ9 బొగ్గుకు ఉన్న అవకాశాలపై ఆరా తీయగా గత ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొనకపోవడంతో జీ9 బొగ్గును సింగరేణి సరఫరా చేయలేదని అధికారులు తేల్చిచెప్పారు. సింగరేణిలో ఇప్పటికే 14 బొగ్గు బ్లాకులు మూతపడ్డాయని తెలిపారు. తక్షణమే కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డితో చర్చించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. దసరా లోపు యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, విద్యుత్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, సింగరేణి సీఎండీ జ్యోతి బుద్ధ ప్రకాష్, ట్రాన్స్‌కో సీఎండీ డి.కృష్ణభాస్కర్, టీజీఆర్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ, జెన్‌కో సీఎండీ ఎస్.హరీష్, టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి.పాటిల్, టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఎస్‌సీసీఎల్ డైరెక్టర్ (పీడబ్ల్యూ&ఏ) పి.గౌతమ్, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.



# ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనాలు జరగాలి

- **భారీ బందోబస్తు.. సమన్వయంతో ఏర్పాట్లు**
- **డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలి**
- **ఉత్సవ కమిటీలకు సూచించిన డీజీపీ**

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 :**

గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖల సమన్వయంతో విస్తృత ఏర్పాట్లు చేసినట్లు డీజీపీ సి.వి.ఆనంద్ తెలిపారు. ఖైరతాబాద్ మహాగణపతిని బుధవారం దర్శించుకున్న ఆయన రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, గణనాథుడి ఆశీస్సులు అందరికీ లభించాలని ఆకాంక్షించారు. సెంట్రల్ జోన్ డీసీపీగా పనిచేసినప్పటి నుంచి ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలతో తనకు 13 ఏళ్ల అనుబంధం ఉందని డీజీపీ గుర్తు చేశారు. నాడు సుదర్శన్, ఇప్పుడు వారి కొడుకులు సందీప్, రాజ్ కుమార్, కూతురు వీణ, మహేష్ యాదవ్, ఇతర సభ్యులు శాంతియుతంగా నిమజ్జనాలు చెయ్యడానికి చాలా సహకరిస్తారని తెలిపారు. ఖైరతాబాద్ గణేష్ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులతోపాటు పోలీసు, ఇతర ప్రభుత్వ శాఖల సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పది రోజుల గణేష్ ఉత్సవాలు ముగింపు దశకు చేరుకున్నాయని డీజీపీ తెలిపారు. ఇప్పటికే పలు ప్రాంతాల్లో నిమజ్జనాలు జరుగుతున్నాయని, రేపు, ఎల్లుండి భారీ సంఖ్యలో నిమజ్జనాలు జరిగే అవకాశం ఉందన్నారు. హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లోనూ సీపీలు, ఎస్పీలు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో సుమారు 30 వేల మంది పోలీసులను బందోబస్తు కోసం మోహరించినట్లు వెల్లడించారు. నిమజ్జనాల కోసం జీహెచ్ఎంసీ, విద్యుత్, జలవనరులు, ఇతర ప్రభుత్వ శాఖలతో పోలీసు శాఖ సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. హుస్సేన్‌సాగర్‌తో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లు పూర్తిచేశామని చెప్పారు. ట్యాంక్‌బండ్‌పై అవసరమైనచోట్ల క్రేన్లను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. నిమజ్జన ఊరేగింపు మార్గాల్లో చోరీలు, మహిళల పట్ల వేధింపులు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు డీజీపీ తెలిపారు. షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించామని, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలు సమన్వయంతో పని చేస్తున్నాయని చెప్పారు. నిమజ్జన ఊరేగింపుల్లో డీజేలు, బాణసంచా వినియోగంపై సుప్రీంకోర్టు మార్గదర్శకాలు అమల్లో ఉన్నాయని గుర్తుచేశారు. అధిక శబ్దాలతో ప్రజలు, ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఉత్సవ కమిటీలు డీజేలు, బాణసంచాకు దూరంగా ఉండాలని స్వచ్ఛందంగా నిర్ణయించుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రశాంత వాతావరణంలో గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించాలని డీజీపీ ఆనంద్ సూచించారు.



# రైతు కన్నీటిలో ఓట్లు వెతకడమా?

మొదటిపేజీ తరువాయి

ప్రతిపక్ష లక్షణం కాదని మండిపడ్డారు. నేరేడుచర్ల మండలం మేడారం గ్రామంలో రూ.26.40 కోట్లతో నిర్మించిన నేరేడుచర్లదూపాడు డబుల్ రోడ్డును మంత్రి ఉత్తమ్ బుధవారం ప్రారంభించారు. రూ.20 లక్షలతో నిర్మించిన జానల్‌దిన్నె గ్రామ పంచాయతీ భవనం, రూ.33 లక్షలతో నిర్మించిన నేరేడుచర్ల గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించారు. మొత్తం రూ.26.93 కోట్ల అభివృద్ధి పనులను ప్రజలకు అంకితం చేశారు. అనంతరం జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ఎల్‌నినో అనేది ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేసే శాస్త్రీయ పరిణామం.. భారత రుతుపవనాలపైనా దాని ప్రభావం పడుతుంది.. ఈసారి వర్షపాతం దాదాపు 40 శాతం తగ్గింది.. ఈ వాస్తవాన్ని దాచిపెట్టి ప్రభుత్వంపై విషప్రచారం చేయడం బీఆర్ఎస్ రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం అని విమర్శించారు. పొలంలో పంట ఎండిపోతే ప్రభుత్వానికి బాధ కలుగుతుంది.. బీఆర్ఎస్‌కు మాత్రం రాజకీయ అవకాశం కనిపిస్తోంది. రైతు కన్నీటిలో ఓట్లు వెతకడం కంటే నీచమైన రాజకీయం మరొకటి ఉండదు అంటూ విరుచుకుపడ్డారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి చుక్కనూ కాపాడి ప్రజల అవసరాలకు వినియోగించడం ప్రభుత్వ బాధ్యత అని స్పష్టం చేశారు. పంటలను కాపాడడం, రాబోయే వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చూసేందుకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తోందన్నారు. సమస్య వచ్చినప్పుడు పరిష్కారాన్ని వెతికేది కాంగ్రెస్ ప్రభుత్వం.. సమస్య మరింత పెరగాలని కోరుకునేది బీఆర్ఎస్.. తాము రైతు పంటను కాపాడేందుకు నీళ్ల కోసం రాష్ట్రాల తలుపులు తడుతున్నాం అని చెప్పారు. జూరాల ఆయకట్టు కింద పంటలను కాపాడేందుకు కర్ణాటక నుంచి నీటిని విడుదల చేయించే అంశంపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్‌తో మంతనాలు జరిపినట్లు ఉత్తమ్ వెల్లడించారు. తనకున్న వ్యక్తిగత స్నేహాన్ని రాష్ట్ర రైతుల ప్రయోజనాల కోసం వినియోగించానని చెప్పారు. రాష్ట్ర విజ్ఞప్తికి డీకే సానుకూలంగా స్పందించారని, నీటి లభ్యతను పరిశీలించి సహకరించేందుకు హామీ ఇచ్చారని వివరించారు. 'మేం కర్ణాటకతో మాట్లాడి నీళ్లు తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం.. బీఆర్ఎస్ నేతలు మాత్రం రైతుల్లో భయం సృష్టిస్తున్నారు.. మాకు రాజకీయాల కంటే పంటలు ముఖ్యం.. ప్రచారం కంటే ప్రజల ప్రాణాలు ముఖ్యం' అని మంత్రి స్పష్టం చేశారు. ప్రకృతిని శాసించలేము.. కానీ ప్రజలను కాపాడే బాధ్యత నుంచి ఒక్క అడుగు కూడా వెనక్కి వెళ్లం' అని ప్రకటించారు. ప్రజల అవసరాలకనుగుణంగా మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ ప్రాంతంతో తనకు ఉన్నది రాజకీయ సంబంధమే కాదు.. ప్రజలతో పెనవేసుకున్న ఆత్మీయ అనుబంధం.. మీ శ్రమ, ప్రేమ, ఆదరాభిమానాలతోనే ఆరుసార్లు శాసనసభకు, ఒకసారి లోక్‌సభకు ఎన్నికయ్యాను.. మీ రుణాన్ని అభివృద్ధితోనే తీర్చుకుంటా' అని చెప్పారు. పార్టీకి కార్యకర్తలు, నాయకులే వెన్నెముక అని మంత్రి అన్నారు. వారి కృషి, ప్రజల విశ్వాసంతోనే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. కోదాడ మెగా జాబ్ మేళా విజయవంతం కావడం ఈ ప్రాంత యువతపై ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమని చెప్పారు. రోడ్లు, భవనాలు నిర్మించడం అభివృద్ధిలో ఒక భాగం.. కానీ ఒక యువకుడికి ఉద్యోగం వచ్చి అతని కుటుంబంలో వెలుగు నిండితే అంతకంటే గొప్ప సంతృప్తి మరొకటి ఉండదు.. కోదాడ మెగా జాబ్ మేళా విజయం ప్రజల ప్రభుత్వం ఏ విధంగా పనిచేస్తుందో నిరూపించింది అని ఉత్తమ్ అన్నారు. ప్రజా సంక్షేమం, రైతుల రక్షణ, యువతకు ఉపాధి, గ్రామాల సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బీఆర్ఎస్ అవాస్తవ ప్రచారాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో విద్యుత్ వ్యవస్థ అస్తవ్యస్తం

**హైదరాబాద్, సెప్టెంబరు 23 :**

రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం నెలకొనడానికి కారణం కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం, విద్యుత్ రంగంలో మిస్ మేనేజ్‌మెంట్, సింగరేణి-జెన్‌కో మధ్య ఆర్థిక వ్యవహారాల్లో గందరగోళమేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు కొరతతో ఉత్పత్తి పడిపోతున్నదని, మరోవైపు జల విద్యుత్ కేంద్రాలు కూడా నీటి లభ్యత లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులపై వాస్తవాలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు ఆరు బీఆర్ఎస్ బృందాలు రాష్ట్రంలోని థర్మల్ పవర్ ప్లాంట్లు, సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని గురువారం సందర్శించనున్నాయని వెల్లడించారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు కరెంట్ విలాస వస్తువు కాదని, జీవన రేఖ అని అన్నారు. వ్యవసాయం, సాగు, తాగునీరు, పరిశ్రమలు, ఐటీ రంగం, గృహ అవసరాలు అన్నింటికీ విద్యుత్ అత్యంత కీలకమని చెప్పారు. విద్యుత్ సమస్యపైనే తెలంగాణ మలి దశ ఉద్యమానికి పునాది పడిందని గుర్తుచేశారు. తెలంగాణ ఏర్పడే నాటికి రాష్ట్రంలో 7,778 మెగావాట్ల స్థాపిత విద్యుత్ సామర్థ్యం ఉండగా బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేండ్లలో దాన్ని 19,472 మెగావాట్లకు పెంచామని కేటీఆర్ తెలిపారు. విద్యుత్ రంగంలో దాదాపు రూ.లక్ష కోట్లు పెట్టుబడి పెట్టామని చెప్పారు. 400 కేవీ సబ్‌స్టేషన్లను 28కు, 220 కేవీ సబ్‌స్టేషన్లను 51 నుంచి 103కు పెంచినట్టు వివరించారు. దాదాపు 30 లక్షల వ్యవసాయ పంపుసెట్లకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించామన్నారు. అప్పట్లో దేశంలోనే అత్యధిక ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ సాధించిన విద్యుత్ కేంద్రాల్లో సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ కూడా ఒకటని కేటీఆర్ చెప్పారు. సింగరేణి విద్యుత్ కేంద్రం సుమారు 91 శాతం పీఎల్ఎఫ్‌తో పనిచేసిందని తెలిపారు. ప్రస్తుతం అదే సంస్థ, అదే విద్యుత్ వ్యవస్థ ఇబ్బందుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రైతులకు ఆరు గంటలకు మించి కరెంట్ సరఫరా కావడం లేదన్నారు. ప్రభుత్వం 24 గంటల విద్యుత్ ఇస్తున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉందన్నారు. సబ్‌స్టేషన్ల వద్ద రైతుల ధర్నాలు, రాస్తారోకోలు జరుగుతున్నాయని చెప్పారు. విద్యుత్ కోతల ప్రభావం వ్యవసాయ రంగానికే పరిమితం కావడం లేదని, పరిశ్రమలు కూడా ప్రత్యామ్నాయ వనరులపై ఆధారపడుతున్నాయని తెలిపారు. దీనివల్ల పరిశ్రమల నిర్వహణ వ్యయం పెరిగే పరిస్థితి ఏర్పడుతున్నదన్నారు.

**80ల నాటి పరిస్థితులు**

సోషల్ మీడియాలో '80స్ ట్రెండ్' నడుస్తున్న సమయంలో తెలంగాణలో మాత్రం 1980ల నాటి విద్యుత్ పరిస్థితులు తిరిగి వచ్చాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అప్పట్లో రైతులు విద్యుత్ కోసం పడిన ఇబ్బందులు ఇప్పుడు మళ్లీ కనిపిస్తున్నాయన్నారు. విద్యుత్ కోతలతో పంటలు ఎండిపోయే పరిస్థితి, క్రాప్ హాలిడే ప్రకటించాల్సిన పరిస్థితి ఏర్పడుతున్నదని ఆరోపించారు. రానున్న వేసవిలో పరిస్థితి మరింత తీవ్రమైతే తాగునీరు, యాసంగి పంటలు, పరిశ్రమలకు విద్యుత్ సరఫరా వంటి అంశాలపై ప్రభుత్వం ఏం ప్రణాళికతో ముందుకెళ్తున్నదో చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న సమయంలో ఉత్పత్తి కేంద్రాలు వరుసగా నిలిచిపోవడంపై ప్రశ్నలు సంధించారు. 4,000 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో సుమారు 400 మెగావాట్లే ఉత్పత్తి అవుతున్నదని తెలిపారు. భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో 270 మెగావాట్ల సామర్థ్యం ఉన్న యూనిట్ నిలిచిపోయిందన్నారు. జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ 1,200 మెగావాట్ల సామర్థ్యం కలిగి ఉండగా సుమారు 544 మెగావాట్ల స్థాయిలోనే ఉత్పత్తి జరుగుతున్నదని చెప్పారు. పలు థర్మల్ యూనిట్లలో బొగ్గు కొరతతో ఉత్పత్తి ప్రభావితమైందని ఆరోపించారు.

**'ఎల్‌నినో కాదు.. ఎల్ కాంగో'**

విద్యుత్ సంక్షోభానికి ఎల్‌నినో ప్రభావమే కారణమన్న వివరణను కేటీఆర్ తిరస్కరించారు. 'ఇది ఎల్‌నినో కాదు.. ఎల్ కాంగో' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. విద్యుత్ సంక్షోభానికి ప్రధాన కారణాల్లో సింగరేణి బొగ్గు సరఫరా వ్యవస్థ కూడా ఒకటని కేటీఆర్ ఆరోపించారు. జెన్‌కోకు నాణ్యమైన బొగ్గు అందించాల్సిన సింగరేణి తక్కువ నాణ్యత కలిగిన జి13, జి14 గ్రేడ్ బొగ్గును సరఫరా చేస్తున్నదన్నారు. నాసిరకం బొగ్గు వినియోగంతో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం తగ్గడంతో రూ.2,900 కోట్ల ప్రజాధనం నష్టపోయిందని చెప్పారు. సింగరేణి నుంచి 40 లక్షల టన్నుల బొగ్గు మాయమైందంటూ దీనిలో సుమారు రూ.1,600 కోట్ల మేర అక్రమాలు జరిగాయన్న తమ పార్టీ ఆరోపణలను మరోసారి ప్రస్తావించారు. బొగ్గు నిల్వలు అందుబాటులో ఉంటే థర్మల్ పవర్ ప్లాంట్లు ఎందుకు నిలిచిపోతున్నాయని ప్రశ్నించారు. సింగరేణి నుంచి జెన్‌కోకు బొగ్గు సరఫరా, జెన్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిల వ్యవహారంపై కూడా ప్రశ్నలు లేవనెత్తారు. సింగరేణికి ప్రభుత్వం నుంచి సుమారు రూ.52 వేల కోట్ల బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. బకాయిల చెల్లింపులు నిలిచిపోవడం సంస్థ కార్యకలాపాలపై ప్రభావం చూపుతున్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సింగరేణి సంస్థతో ఫుట్‌బాల్ ఆట ఆడుతున్నదని కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. సింగరేణి కార్మికులు, రైతులు, పరిశ్రమలు, ఐటీ పార్కుల భవిష్యత్తుతో ఆటలాడే పరిస్థితి రావద్దన్నారు. బొగ్గు ఉత్పత్తి, సరఫరా, ఆర్థిక వ్యవహారాలు, పవర్ ప్లాంట్ల నిర్వహణపై ప్రభుత్వం సమగ్రంగా దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో 'గ్రాస్ మిస్ మేనేజ్‌మెంట్ ఆఫ్ రిసోర్సెస్, గ్రాస్ మిస్ మేనేజ్‌మెంట్ ఆఫ్ ఫైనాన్సెస్, గ్రాస్ మిస్ మేనేజ్‌మెంట్ ఆఫ్ నేచురల్ రిసోర్సెస్' జరుగుతున్నట్లు కేటీఆర్ ఆరోపించారు. సింగరేణి బొగ్గు ఉత్పత్తి 202324లో 70 మిలియన్ టన్నుల నుంచి 202526లో 58 మిలియన్ టన్నులకు పడిపోయిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ గణాంకాల ఆధారంగా సంస్థ పనితీరుపై ప్రభుత్వం సమగ్ర వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది**

రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి ప్రకృతి పరిస్థితులే కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యం, చేతకానితనం, మిస్ మేనేజ్‌మెంట్, కమీషన్లు, అవినీతి కారణమని కేటీఆర్ ఆరోపించారు. గత ప్రభుత్వం నిర్మించిన విద్యుత్ మౌలిక వసతులను సరిగా నిర్వహించకుండా ఉన్న వ్యవస్థను నాశనం చేసి, చిన్నాభిన్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ వచ్చింది.. కరెంట్ పోయింది అని వ్యాఖ్యానించిన కేటీఆర్ ఎన్నికల సమయంలో తాము చేసిన హెచ్చరికలే ఇప్పుడు నిజమవుతున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లిలోనూ రైతులు విద్యుత్ సమస్యపై రోడ్డెక్కారని గుర్తుచేశారు.

**ఆరు బృందాలతో క్షేత్రస్థాయి పరిశీలన**

విద్యుత్ వ్యవస్థపై తాము చేస్తున్న ఆరోపణలకు క్షేత్రస్థాయి ఆధారాలు సేకరించేందుకు ఆరు బృందాలను పంపుతున్నట్టు కేటీఆర్ ప్రకటించారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నేతృత్వంలోని బృందం పరిశీలిస్తుంది. కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్‌ను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధు ఆధ్వర్యంలోని బృందం సందర్శిస్తుంది. మణుగూరులోని భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు నేతృత్వంలోని బృందం పరిశీలించనుంది. భూపాలపల్లిలోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌ను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి తదితరులు పరిశీలిస్తారు. జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దివాకర్‌రావు తదితరులు సందర్శించనున్నారు. హైదరాబాద్‌లోని సింగరేణి ప్రధాన కార్యాలయాన్ని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యే వివేకానందగౌడ్, ఎమ్మెల్సీలు దాసోజు శ్రవణ్, శంభీపూర్ రాజు తదితరులు పరిశీలిస్తారు. అన్ని అంశాలను పరిశీలించి వాస్తవాలను ప్రజల ముందుంచుతామని కేటీఆర్ తెలిపారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని, పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసిన ఆయన ఆరు బృందాల నివేదికల అనంతరం పార్టీ తరఫున తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని వెల్లడించారు.

# డిజిటల్ గవర్నెన్స్ లో రోల్ మోడల్‌గా తెలంగాణ

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 :**

గుడ్ గవర్నెన్స్‌కు టెక్నాలజీని జోడించి డిజిటల్ గవర్నెన్స్‌లో తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఒక రోల్ మోడల్‌గా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పేర్కొన్నారు. పౌర సేవల్ని నేరుగా ఇంటి ముంగిటకే చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. బాగ్ లింగంపల్లిలోని ఆర్టీసీ కళ్యాణ మండపంలో 'మీ సేవ డోర్ డెలివరీ సర్వీసెస్'ను ఆయన బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాలనలోనూ అనేక విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుడుతున్నామన్నారు. అడ్మినిస్ట్రేషన్‌కు టెక్నాలజీని జోడించి పారదర్శకత, జవాబుదారీతనం, సుపరిపాలనకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. ప్రభుత్వం, యంత్రాంగమే నేరుగా ప్రజల దగ్గరికే వెళ్లేలా ఈ 'డోర్ డెలివరీ సర్వీసెస్'కు శ్రీకారం చుట్టామన్నారు. 1100 టోల్ ఫ్రీ నంబర్ లేదా మీ సేవ పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే జనన/మరణ ధ్రువీకరణ పత్రాలు, ఆదాయ, కుల, నివాస సర్టిఫికెట్లు, ఈసీ కాపీలు, పోలీసు శాఖ సేవలు, ఐజీఆర్ఎస్ రిజిస్ట్రేషన్లు తదితర మీ సేవ సేవలను ఇంటి దగ్గరే అందిస్తామన్నారు. ఇందుకోసం 70మందికి పైగా మీ సేవ ఏజెంట్లు, మీ సేవ వీఎల్ఈలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. తొలి దశలో 'క్యూర' ప్రాంతాల్లో ఈ సేవలను ప్రారంభిస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకూ విస్తరిస్తామన్నారు. పౌరులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి నుంచే పౌర సేవల్ని పొందాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఐటీఈఅండ్ సీ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి, మీ సేవ కమిషనర్ రవి కిరణ్, టీజీటీఎస్ ఎండీ సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# శ్రీరామ నవమికి ముందే పనులు పూర్తి కావాలి

- **నాణ్యత, శాస్త్ర విషయాల్లో రాజీ వద్దు**
- **భద్రాద్రి ఆలయ అభివృద్ధి పనులు పరిశీలించిన మంత్రి పొంగులేటి**

**భద్రాచలం, సెప్టెంబర్ 23 :**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసేలా వేగం పెంచాలని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శ్రీరామనవమి, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు కార్యాచరణతో పనులు నిర్వహించాలని, భక్తులకు మెరుగైన సౌకర్యాలు అందేలా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బుధవారం భద్రాచలం వచ్చిన ఆయన ముందుగా శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, భద్రాచలం, అశ్వారావుపేట ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్, జిల్లా ఎస్పీ రోహిత్ రాజులతో కలిసి మంత్రి ఆలయ ప్రాంగణంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఉత్తర ద్వారం వద్ద ఉన్న దమ్మక్క విగ్రహం ప్రాంతం నుంచి పరిశీలన ప్రారంభించి వివిధ నిర్మాణ పనుల పురోగతి, ప్రస్తుత దశ, పూర్తికి అవసరమైన సమయం, మానవ వనరులు, నిర్మాణ సామగ్రి తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. లిఫ్టులు, స్లాబ్‌లు, రాతి పనులు, రహదారుల అభివృద్ధి, నిర్మాణ సామగ్రి లభ్యత, సిబ్బంది సమీకరణ, అదనపు నిధులు, సాంకేతిక సమన్వయం తదితర అంశాలపై పనుల వారీగా పురోగతిని పరిశీలించారు. ప్రతి విభాగానికి స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించి వారంవారీ ప్రణాళిక ప్రకారం పనులను ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. ఆలయ పునరుద్ధరణ, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం సుమారు రూ.275 కోట్లT మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే పనులు వేగం పుంజుకున్నాయని చెప్పారు. శ్రీరామనవమికి ముందుగానే ప్రధాన పనులు పూర్తయ్యేలా రివర్స్ ప్లానింగ్ రూపొందించుకోవాలని, గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ఆలయం, మాడ వీధులు, అంతర్గత ప్రాకారం, బాహ్య ప్రాకారం తదితర ప్రాంతాల్లో చేపడుతున్న పనులను ముందుగానే పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ప్రతి మూడు రోజులకు ఒక లిఫ్ట్ పనిని పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. నిర్మాణ సామగ్రి అందుబాటులో లేక పనులకు అంతరాయం కలగకుండా ముందుగానే సిద్ధంగా ఉంచాలని, అవసరమైనచోట బూమ్ పంపులు, ఇతర యంత్ర పరికరాలను వినియోగించి పనుల సామర్థ్యాన్ని పెంచాలని తెలిపారు. స్లాబ్ పనుల్లో ఒక దశ పూర్తయ్యేసరికి తదుపరి దశకు సంబంధించిన ఏర్పాట్లు ఆలస్యం కాకుండా సమాంతరంగా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు.

పనుల మధ్య ఖాళీ సమయం తగ్గించి నిరంతరాయంగా నిర్మాణ కార్యకలాపాలు కొనసాగేలా సమన్వయం చేసుకోవాలని చెప్పారు. రాతి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన నిపుణులు, సిబ్బందిని ప్రత్యేకంగా కేటాయించి రోజువారీ లక్ష్యాలతో పనులు నిర్వహించాలని తెలిపారు. గతంలో చేపట్టిన భారీ ఆలయ, జాతర ప్రాంతాల నిర్మాణ పనుల అనుభవాలను పరిగణనలోకి తీసుకుని ముందస్తు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. ఆలయ నిర్మాణంలో నాణ్యతతోపాటు శాస్త్రోక్తతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ఆలయ సంప్రదాయాలు, నిర్మాణ విధానాలకు అనుగుణంగా పనులు సాగుతున్నాయా అనే అంశాన్ని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి లోపాలకు తావులేకుండా పర్యవేక్షణ వ్యవస్థను పటిష్టం చేయాలని ఆదేశించారు. ఆలయ పరిసర రహదారుల అభివృద్ధికి సంబంధించి సుమారు రూ.25 కోట్ల ప్రతిపాదనను త్వరితగతిన మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఆలయ పనుల పురోగతిపై ప్రజాప్రతినిధులు, జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఇంజనీరింగ్ అధికారులు, ఆర్కిటెక్టులు, సంబంధిత శాఖల అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.



# రాజకీయాల పరమార్థం నిస్వార్థ ప్రజాసేవ

- **బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు**
- **నాగోల్‌లో బీజేవైఎం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం**

**హైదరాబాద్, సెప్టెంబర్ 23 :**

రాజకీయాలు అంటే ఎన్నికలు, ఓట్లు మాత్రమే కాదని, సమాజ హితం కోసం నిస్వార్థ సేవ చేయడమే ప్రజాప్రతినిధికి నిజమైన సంతృప్తినిస్తుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజాప్రతినిధిగా (ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా) 25 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని 'సేవా సంకల్ప్ అభియాన్'లో భాగంగా భారతీయ జనతా యువమోర్చా(బీజేవైఎం) ఆధ్వర్యంలో నాగోల్‌లో బుధవారం భారీ మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రామచందర్ రావు ముఖ్య అతిథిగా హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి స్వయంగా రక్తదానం చేసి యువతలో ఉత్సాహం నింపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నాయకుడి ఆలోచనా విధానంలో ప్రజాసేవ అంతర్భాగం కావాలని, సమాజానికి మేలు చేసినప్పుడే అంతర్గతంగా నిజమైన సంతృప్తి, సంతోషం లభిస్తాయని అన్నారు. నరేంద్ర మోదీ జన్మదినం, అలాగే ఆయన 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ప్రజల్లో సేవా భావాన్ని మరింత పెంపొందించాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రధాని మోదీ విద్యారంగానికి పెద్దపీట వేస్తూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, దేశవ్యాప్తంగా ఐఐటీలు, ఎయిమ్స్, ఐఐఎంలతోపాటు ఉన్నత విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాలను భారీగా పెంచారని కొనియాడారు. మోదీ దేశసేవను ఆదర్శంగా తీసుకుని సేవా రంగంలో యువత ముందుండాలని పిలుపునిచ్చారు. ఇతరుల ప్రాణాలు కాపాడేందుకు చేసే రక్తదానం జీవితంలో వెలకట్టలేని సంతృప్తిని ఇస్తుందని అన్నారు. ఈ స్ఫూర్తిని ఇలాగే కొనసాగిస్తూ రాష్ట్రంలోని మరింతమంది యువత ముందుకొచ్చి రక్తదానం చేయాలని రామచందర్ రావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్. గౌతం రావు, వీరేందర్ గౌడ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కాసం వెంకటేశ్వర్లు, బండ కార్తీక రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ కుందే, రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, బీజేవైఎం రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో విద్యార్థులు, యువత పాల్గొన్నారు.



**ఎన్నికలకు సమాయత్తం కావాలి**

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు అధ్యక్షతన రానున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గాల ఎన్నికలు, ఐదు మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలకు సంబంధించి సన్నాహక సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ఆయా కార్పొరేషన్లకు సంబంధించిన ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో రానున్న రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు పార్టీ శ్రేణులను సమాయత్తం చేయడం, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడం, ఎన్నికల నిర్వహణకు అనుసరించాల్సిన వ్యూహాలు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలు, మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసేలా కార్యాచరణ రూపొందించాలని రామచందర్ రావు నాయకులకు దిశానిర్దేశం చేశారు.

# డ్రగ్స్‌పై పోరాటం ఇంటి నుంచే ప్రారంభం

- **ప్రభుత్వం, పోలీసులకే బాధ్యత పరిమితం కాదు: గవర్నర్ శివప్రతాప్ శుక్లా**
- **కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి ఉద్యమంగా మార్చాలి**
- **విద్యార్థులతో యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞ, డిక్లరేషన్‌కు సూచన**
- **వ్యసన బాధితులకు కౌన్సెలింగ్, పునరావాసం కల్పించాలి**
- **'నశా ముక్త్ యువ' కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో అమలు చేయాలి**

**హైదరాబాద్, సెప్టెంబరు 23:**

డ్రగ్స్ మహమ్మారి నుంచి యువతను, విద్యార్థులను కాపాడటం ప్రభుత్వం, పోలీసుల బాధ్యత మాత్రమే కాదని.. ప్రతి కుటుంబం, విద్యాసంస్థ, సమాజం కలిసి చేపట్టాల్సిన సామాజిక ఉద్యమమని తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. డ్రగ్స్‌పై పోరాటం ఇంటి నుంచే ప్రారంభమై.. విద్యాసంస్థల్లో బలపడి, యువత ద్వారా ప్రజా ఉద్యమంగా మారాలని పిలుపునిచ్చారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా.. గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి 'నశా ముక్త్ భారత్ అభియాన్'ను తెలంగాణలో ప్రజా ఉద్యమంగా మార్చేందుకు శివప్రతాప్ శుక్లా పలు కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. హైదరాబాద్‌తో పాటు నిజామాబాద్, హనుమకొండ, వరంగల్, ఆసిఫాబాద్ జిల్లాల్లో పర్యటించి యువత, విద్యార్థుల్లో అవగాహన కల్పించారు.




ప్రతి పాఠశాల, కళాశాలలో యాంటీ డ్రగ్ ప్రతిజ్ఞ చేయించడంతో పాటు.. విద్యాసంస్థల్లో చేరే సమయంలోనే డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని విద్యార్థులతో డిక్లరేషన్ తీసుకోవాలని సూచించారు.

మిషన్ మోడ్‌లో కార్యక్రమాలు విశ్వవిద్యాలయాల వీసీలతో నిర్వహించిన సమావేశంలో 'నశా ముక్త్ యువ' కార్యక్రమాన్ని మిషన్ మోడ్‌లో అమలు చేయాలని గవర్నర్ సూచించారు. విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్‌సీసీ క్యాడెట్లు, అధ్యాపకులు 'మై భారత్' పోర్టల్ ద్వారా ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. వ్యసనానికి గురైన వారిని కేవలం నేరస్తులుగా చూడకుండా కౌన్సెలింగ్, పునరావాసం కల్పించాలని సూచించారు. యువత తమ శక్తిసామర్థ్యాలను విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, ఆవిష్కరణల వైపు మళ్లించాలని కోరారు.

# ఎన్నికల సంఘం రిగ్గింగ్ ను అనుమతిస్తే దేశ ద్రోహమే



- కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 23 :**

ఎన్నికల్లో అక్రమాలు జరుగుతున్నాయని తెలిసి కూడా సీఈసీ జనేష్ కుమార్ వాటిని అనుమతిస్తే అది దేశ ద్రోహం, రాజ ద్రోహమే అవుతుందని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా వ్యాఖ్యానించారు. వయనాడ్ ఎంపీ అయిన ఆమె ఎన్నికల అక్రమాలకు పాల్పడుతున్న వారిని కచ్చితంగా నిలదీయాలన్నారు. ఇక్కడి నిలంబూర్ లో విలేకరులతో బుధవారం మాట్లాడిన ప్రియాంకా గాంధీ భారత ఎన్నికల సంఘం వ్యవహారాల్లో చోటుచేసుకుంటున్న పక్షపాతం, అన్యాయం గురించి తన సోదరుడు, లోక్ సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నిరంతరం గళమెత్తుతున్నారని తెలిపారు. ఆయన అనేక సమస్యలను పదేపదే ప్రస్తావించారని, ఇప్పుడు స్వయంగా ఎన్నికల కమిషనర్లు కూడా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ కు కొన్ని సమస్యలను వివరించినట్లు వార్తా మాధ్యమాల్లో కూడా వెల్లడవుతోందని చెప్పారు.




# 30న జాబ్‌మేళా

- 50 ఫార్మసిస్ట్, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ పోస్టుల భర్తీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 23:**

ఉస్మానియా యూనివర్సిటీలోని ఎంప్లాయిమెంట్ బ్యూరో ఆధ్వర్యంలో అపోలో ఫార్మసీ ఈనెల 30న ఉదయం 11 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నది. ఉస్మానియా యూనివర్సిటీ, ఆర్ట్స్ కాలేజీ ఎదురుగా ఉన్న ఎంప్లాయిమెంట్ బ్యూరో కార్యాలయంలో ఈ మేలా జరుగుతుంది. దీని ద్వారా అపోలో ఫార్మసీలోని ఫార్మసిస్టు, అసిస్టెంట్ ఫార్మసిస్ట్ 50 పోస్టులను భర్తీ చేయనున్నారు. డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఎం.ఫార్మసీ, డిగ్రీ చేసిన 18 నుండి 35 సంవత్సరాల వయసు వారికి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (యూఈఐ అండ్ జీబీ/ఎంసీసీ) ఒక ప్రకటనలో తెలియజేసింది. రూ.16,583 నుండి రూ.25,000 వేల వరకు వేతనం ఉండే ఈ ఉద్యోగాలకు సంబంధించి మరిన్ని వివరాలకు టి.రఘుపతి, హెచ్ఆర్ ఫోన్: 8247656356 నందు సంప్రదించాలని కోరింది. విద్యార్హతల సర్టిఫికెట్ల జిరాక్స్‌తో ఉస్మానియా యూనివర్సిటీ ఎంప్లాయిమెంట్ బ్యూరో వద్ద నేరుగా సెప్టెంబర్ 30న హాజరు కావాలన్నది.

# సర్ పై మమత తీవ్ర ఆరోపణలు

- ఈసీ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిందని ఆరోపణ • ఎస్ఐఆర్ జరిగిన రాష్ట్రాల్లో రీపోలింగ్ జరపాలని డిమాండ్
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ కేసులు పెట్టాలని వ్యాఖ్య
- బెంగాల్ ఎన్నికలను మళ్లీ నిర్వహించాలని డిమాండ్
- ఈసీలో అంతర్గత విభేదాలున్నాయన్న 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం
- ఆరోపణలను ఖండించిన ఎన్నికల సంఘం

**కోల్‌కతా, సెప్టెంబరు 23:**

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)పై 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్'లో వచ్చిన నివేదిక నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం, టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ ఎన్నికల సంఘంపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఎన్నికల సంఘం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించిందని ఆమె ఆరోపించారు. SIR నిర్వహించిన అన్ని రాష్ట్రాల్లో రీపోలింగ్ చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను అరెస్టు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మమత కోరారు. ఆయన పర్యవేక్షణలో ఎన్నికలు జరిగిన ప్రాంతాల్లో మళ్లీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. తమ ఫిర్యాదులపై ప్రధాన న్యాయమూర్తిని ఆశ్రయించామని, ప్రజల అభ్యంతరాలను న్యాయవ్యవస్థ పరిగణనలోకి తీసుకోవాలని అన్నారు.

కాగా, SIRపై ఈసీలో అంతర్గత విభేదాలు ఉన్నట్లు 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' కథనం ప్రచురించింది. అయితే ఈ ఆరోపణలను ఎన్నికల సంఘం ఖండించింది. SIR సహా అన్ని తుది నిర్ణయాలు ముగ్గురు ఎన్నికల కమిషనర్ల ఏకగ్రీవ ఆమోదంతోనే తీసుకున్నామని స్పష్టం చేసింది.

# ధరలకు కళ్లెం వేసేందుకు కేంద్రం కీలక నిర్ణయం

- వంటనూనెలపై దిగుమతి సుంకం తగ్గింపు
- క్రూడ్ సోయాబీన్, పామ్ ఆయిల్‌పై డ్యూటీ 10% నుంచి 5%కి తగ్గింపు
- రిఫైండ్ సోయాబీన్, పామ్ ఆయిల్‌పై 32.5% నుంచి 27.5%కి కోత
- క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై 10% సుంకం పూర్తిగా రద్దు
- రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై డ్యూటీ 22.5%కి తగ్గింపు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:**

దేశీయ మార్కెట్‌లో వంటనూనెల ధరలను నియంత్రించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పలు రకాల వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని తగ్గిస్తూ కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. క్రూడ్ సోయాబీన్, క్రూడ్ పామ్ ఆయిల్‌పై ప్రాథమిక కస్టమ్స్ డ్యూటీని 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. రిఫైండ్ సోయాబీన్, పామ్ ఆయిల్‌పై సుంకాన్ని 32.5 శాతం నుంచి 27.5 శాతానికి కుదించింది. సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై మరింత ఊరట కల్పించింది. క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై ఉన్న 10 శాతం కస్టమ్స్ డ్యూటీని పూర్తిగా రద్దు చేయగా.. రిఫైండ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై సుంకాన్ని 32.5 శాతం నుంచి 22.5 శాతానికి తగ్గించింది. సవరించిన రేట్లు రేపటి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి.

# బీజేపీలో కీలక సంస్థాగత మార్పులు

- 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు ఇన్‌ఛార్జ్‌లు, సహ ఇన్‌ఛార్జ్‌లు
- తెలంగాణ, పశ్చిమ బెంగాల్‌కు సునీల్ బన్సల్
- తెలంగాణకు అభయ్ పాటిల్, రేఖా శర్మ సహ ఇన్‌ఛార్జ్‌లు
- యూపీ బాధ్యతలు వినోద్ తావ్డేకు.. నలుగురు సహ ఇన్‌ఛార్జ్‌లు
- హరియాణా, ఛత్తీస్‌గఢ్‌కు స్మృతి ఇరానీ
- తమిళనాడు, ఉత్తరాఖండ్ బాధ్యతలు రామ్ మాధవ్‌కు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:**

వచ్చే ఏడాది పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బీజేపీ సంస్థాగతంగా కీలక మార్పులు చేపట్టింది. 28 రాష్ట్రాలు, 8 కేంద్ర పాలిత ప్రాంతాలకు పార్టీ ఇన్‌ఛార్జ్‌లు, సహ ఇన్‌ఛార్జ్‌లను జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ నియమించారు.

తెలంగాణ బాధ్యతలు సునీల్ బన్సల్‌కు కొనసాగిస్తూ.. అభయ్ పాటిల్, రేఖా శర్మలను సహ ఇన్‌ఛార్జ్‌లుగా నియమించారు. పశ్చిమ బెంగాల్ బాధ్యతలు కూడా బన్సల్‌కే అప్పగించారు. హరియాణా, ఛత్తీస్‌గఢ్‌కు స్మృతి ఇరానీని, ఉత్తరప్రదేశ్‌కు వినోద్ తావ్డేను ఇన్‌ఛార్జ్‌లుగా నియమించారు. యూపీకి జగదీశ్ పటేల్, మేధా కులకర్ణి, ప్రదీప్ శర్మ, అనంత్ ఓజాలను సహ ఇన్‌ఛార్జ్‌లుగా నియమించారు.

ఆంధ్రప్రదేశ్‌కు అరవింద్ భదౌరియా ఇన్‌ఛార్జ్‌గా, వనతి శ్రీనివాసన్ సహ ఇన్‌ఛార్జ్‌గా నియమితులయ్యారు. ఒడిశాకు పురందేశ్వరి, మహారాష్ట్రకు బైజయంత్ జయ్ పాండా, రాజస్థాన్‌కు సంజయ్ భాటియా బాధ్యతలు దక్కాయి. తమిళనాడు, ఉత్తరాఖండ్‌కు రామ్ మాధవ్‌ను ఇన్‌ఛార్జ్‌గా నియమించారు.




కర్ణాటకకు హరీశ్ ద్వివేది, గుజరాత్‌కు తరుణ్ చుగ్, పంజాబ్, జమ్మూకశ్మీర్‌కు సతీశ్ పూనియా, ఢిల్లీకి వినయ్ సహస్రబుద్ధే, కేరళకు ఎం. నాగరాజు, బిహార్‌కు హరీశ్ ద్వివేది తదితరులకు బాధ్యతలు అప్పగించారు.

# అశ్వాపురం ప్రాంతంలో గోదావరి జలాల పరుగులు

- మారేళ్లపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభం
- తుమ్మల చెరువులోకి నీరు విడుదల చేసిన మంత్రులు తుమ్మల, పొంగులేటి
- తొలి విడతలో 4,300 ఎకరాలకు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల వెల్లడి


**అశ్వాపురం, సెప్టెంబర్ 23 :**

రైతుల చిరకాల స్వప్నాన్ని సాకారం చేస్తూ అశ్వాపురం మండలం మారేళ్లపాడులో ఎత్తిపోతల పథకాన్ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు బుధవారం ప్రారంభించారు. పంపులను ఆన్ చేసి గోదావరి జలాలను తుమ్మల చెరువుకు విడుదల చేసి పథకాన్ని జాతికి అంకితం చేశారు. సుమారు రూ.610 కోట్లతో చేపట్టిన ఈ పథకం ద్వారా తొలి విడతలో 4,300 ఎకరాలకు, దశలవారీగా అశ్వాపురం మండలంలో 22 నుంచి 23 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. ఈ సందర్భంగా గొందిగూడెంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ తుమ్మల చెరువుకు గోదావరి జలాలు అందించాలన్న అశ్వాపురం ప్రాంత రైతుల చిరకాల కోరిక నెరవేరిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంతో సీతారామ ప్రాజెక్టును పూర్తి చేసి అశ్వాపురం, పినపాక ప్రాంతం నుంచి గోదావరి జలాలను పాలేరు వరకు తీసుకెళ్లాలని నిర్ణయించినట్లు తెలిపారు. సీతారామ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణానికి అవసరమైన అదనపు నిధులను ముఖ్యమంత్రి మంజూరు చేశారని మంత్రి తెలిపారు. ఇల్లెందు నియోజకవర్గానికి సాగునీరు అందించేందుకు జూలూరుపాడు టన్నెల్, లలితాపురం వద్ద ఎత్తిపోతల పథకం తదితర అంశాలపై సర్వేలు నిర్వహించి సవరించిన అంచనాలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. అన్నదైవం ప్రాజెక్టుకు కూడా గోదావరి జలాలను విడుదల చేస్తున్నామని తెలిపారు. కాల్వల భూసేకరణలో రైతులు సహకరించాలని, భూములు కోల్పోయే వారికి పరిహారం అందించాలని అధికారులను ఆదేశించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా సుమారు పది నియోజకవర్గాల్లో సాగునీటి విస్తరణకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. భద్రాచలం నియోజకవర్గంలో ప్రగళ్లపల్లి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి పాలెంవాగు, తాలిపేరు, మోడికుంటవాగు వంటి ప్రాజెక్టులతో అనుసంధానం చేస్తే మరిన్ని మండలాలకు సాగునీరు అందే అవకాశం ఉంటుందని చెప్పారు. పులుసుబొంత్ ప్రాంతంలో అటవీ అనుమతులు, ప్రత్యామ్నాయ భూముల గుర్తింపు వంటి సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో సాధ్యమైన ప్రాంతాల్లో చిన్న బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను ఏర్పాటు చేసి గోదావరి జలాలను నిల్వ చేయాలని సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీరు, విద్యుత్‌ను పొదుపుగా వినియోగించుకోవాలని మంత్రి తుమ్మల రైతులకు సూచించారు. అశ్వారావుపేట, పినపాక ప్రాంతాల్లో ఆయిల్‌పామ్ సాగుపై రైతుల్లో ఆసక్తి పెరుగుతోందని మంత్రి తుమ్మల తెలిపారు.

**నిరుద్యోగులు, యువత సంక్షేమానికి భరోసా : మంత్రి పొంగులేటి**

ప్రజా ప్రభుత్వం పేదలు, రైతులు, గిరిజనులు, మహిళలు, నిరుద్యోగులు, యువత సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. గత 30 నెలల్లో సుమారు 72 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు చెప్పారు. పులుసుబొంత్ ప్రాజెక్టుకు సంబంధించి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి త్వరలో టెండర్లు పిలిచేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల తదుపరి దశల్లో గిరిజన ప్రాంతాల్లో గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, విద్య, వైద్య రంగాల్లో ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు విస్తరించడంతో రోజుకు సుమారు 450 నుంచి 500 మంది వరకు సేవలు పొందుతున్నారని తెలిపారు.

**రైతులకు పండుగ వాతావరణం : ఎంపీ బలరాంనాయక్**



ఎంపీ పోరిక బలరాంనాయక్ మాట్లాడుతూ మారేళ్లపాడు ఎత్తిపోతల ద్వారా అశ్వాపురం మండలంలోని సుమారు 24 గ్రామాలతోపాటు ఇతర మండలాలకు కూడా సాగునీరు అందించే అవకాశం ఏర్పడిందన్నారు. గోదావరి జలాలు తుమ్మల చెరువుకు చేరుకోవడం రైతులకు పండుగ వాతావరణాన్ని కల్పించిందన్నారు. 2005 డిసెంబర్ 31న దుమ్ముగూడెం రాజీవ్‌సాగర్ ప్రాజెక్టుకు పునాది వేసినప్పటి నుంచి జరిగిన పరిణామాలను వివరించారు. రాష్ట్రం ఏర్పడిన అనంతరం ప్రాజెక్టు రూపకల్పనలో మార్పులు చేసి సీతారామ ప్రాజెక్టుగా అభివృద్ధి చేశారని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2025 ఆగస్టు 15న సీతారామ ఎత్తిపోతలను ప్రారంభించిన విషయాన్ని గుర్తు చేశారు. అశ్వాపురం మండలంలో కుడి కాలువ పనులకు సుమారు రూ.130 కోట్లతో పనులు చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు. చింతకుంట, జగ్గారం పరిధిలోని ఎర్రబోకల చెరువు, మిట్టగూడెం పరిధిలోని లోయర్ చెరువుతోపాటు అనుసంధాన చెరువులకు నీరు అందించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. కుడి కాలువ ద్వారా తొమ్మిది గ్రామ పంచాయతీలకు నీరు అందించి సుమారు 11,981 ఎకరాల కమాండ్ ఏరియాను స్థిరీకరించే అవకాశం ఉందన్నారు. కుడి, ఎడమ కాలువల ద్వారా 24 గ్రామ పంచాయతీల పరిధిలోని 68 గ్రామాలకు, సుమారు 13,037 కుటుంబాలకు, దాదాపు 24 వేల ఎకరాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని తెలిపారు. తుమ్మల చెరువు ప్రధాన కాలువను బలోపేతం చేసి కాంక్రీట్ లైనింగ్‌తో పాటు సుమారు 22 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూటరీ కాలువల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని మంత్రులను కోరారు. గొందిగూడెం, వెంకటాపురం వంటి గిరిజన గ్రామాలకు కూడా సాగునీరు అందించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ అంకిత్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జారే ఆదినారాయణ, ఎస్పి రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి సిద్ధార్ద్ విక్రమ్ సింగ్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ , నీటిపారుదల శాఖ ఎస్ఈ శ్రీనివాస రెడ్డి ప్రజాప్రతినిధులు, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

**దక్షిణ అయోధ్యగా అభివృద్ధి చేయాలనేది లక్ష్యం**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి ముఖ్యమంత్రి హామీ మేరకు రూ.350 కోట్లు మంజూరు చేసి పనులు ప్రారంభించామని తెలిపారు. పుష్కరాల నాటికి సాధ్యమైనంత మేరకు పనులు పూర్తి చేసి భద్రాచలాన్ని దక్షిణ అయోధ్యగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రహదారులు, సాగునీరు, విద్య, వైద్య రంగాల్లో జిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

# ఎన్నికల కమిషనర్ల నియామకంపై సుప్రీంకోర్టులో భిన్న తీర్పు

- 2023 చట్టాన్ని సవాల్ చేసిన పిటిషన్లపై ఇద్దరు న్యాయమూర్తుల విభేదం
- ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి బదిలీపై ఏకాభిప్రాయం కుదరని వైనం
- కేసును విస్తృత ధర్మాసనానికి పంపాలన్న జస్టిస్ ఎస్‌సీ శర్మ
- రిఫర్ చేయాల్సిన అవసరం లేదన్న జస్టిస్ దీపాంకర్ దత్తా
- సీఈసీ, ఈసీల నియామకంలో సీజేఐ తొలగింపుపైనే ప్రధాన అభ్యంతరం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:**

ప్రధాన ఎన్నికల కమిషనర్, ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన 2023 చట్టాన్ని సవాల్ చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టులో బుధవారం భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ కేసును ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేయాలా? వద్దా? అనే అంశంపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఎస్‌సీ శర్మ ఏకాభిప్రాయానికి రాలేదు.

2023 చట్టం ప్రకారం సీఈసీ, ఈసీల ఎంపిక కమిటీలో ప్రధానమంత్రి, కేంద్ర మంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉంటారు. గతంలో ఈ ప్రక్రియలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పాత్ర ఉండగా.. కొత్త చట్టంలో సీజేఐని తొలగించడాన్ని పిటిషనర్లు సవాల్ చేశారు.

కేసును ఐదుగురు న్యాయమూర్తుల ధర్మాసనానికి పంపాలన్న అభ్యర్థనను జస్టిస్ దీపాంకర్ దత్తా తిరస్కరించగా.. జస్టిస్ ఎస్‌సీ శర్మ మాత్రం విస్తృత ధర్మాసనానికి రిఫర్ చేయాలని అభిప్రాయపడ్డారు. దీంతో ఇది స్ప్లిట్ వెర్డిక్ట్‌గా మారింది. తదుపరి ప్రక్రియలో ఈ భిన్నాభిప్రాయాలను పరిష్కరించాల్సి ఉంటుంది. ఎన్నికల కమిషనర్ల నియామక విధానం రాజ్యాంగబద్ధత, ఎంపిక కమిటీ నుంచి సీజేఐ తొలగింపు వంటి అంశాలు ఈ కేసులో కీలకంగా మారనున్నాయి.



# ఘనంగా ముగిసిన వినాయక నిమజ్జనోత్సవాలు













**శెనార్తి మీడియా, కరీంనగర్ :**

తొమ్మిది రోజులపాటు భక్తిశ్రద్ధలతో పూజలందుకున్న గణనాథులకు జిల్లా ప్రజలు గురువారం ఘనంగా వీడ్కోలు పలికారు. కరీంనగర్ నగరంతో పాటు హుజురాబాద్, జమ్మికుంట, చొప్ప దండి తదితర పట్టణాలు, మండలాలు, గ్రామాల్లో వినాయక నిమజ్జనోత్సవాలు అంగరంగ వైభవంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై గణనాథులను శోభాయాత్రగా తరలించి నిమజ్జనం చేశారు. భక్తుల జైజై నినాదాలు, డప్పు చప్పుళ్లు, భక్తిగీతాలతో నిమజ్జన కేంద్రాలు సందడిగా మారాయి.

**తొమ్మిది రోజుల భక్తి.. చివరి రోజు సందడి**

వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాల్లో తొమ్మిది రోజులపాటు ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజు ఉదయం నుంచే ఉత్సవ కమిటీలు విగ్రహాలను నిమజ్జనానికి తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. యువత, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో శోభాయాత్రల్లో పాల్గొన్నారు.

**నగరంలో నాలుగు వేల విగ్రహాలు**

కరీంనగర్ పట్టణ పరిధిలో ఏర్పాటు చేసిన సుమారు నాలుగు వేల వినాయక విగ్రహాలను గురువారం నిమజ్జనానికి తరలించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలపై ఊరేగింపుగా తీసుకెళ్లి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం నిర్వహించారు.

**మానకొండూరులో భారీ ఏర్పాట్లు**

కరీంనగర్ నగర పరిధి నుంచి అత్యధిక సంఖ్యలో వినాయక విగ్రహాలు మానకొండూరు చెరువు వైపు తరలివెళ్లాయి. నిమజ్జనానికి అవసరమైన సంఖ్యలో క్రేన్లను ఏర్పాటు చేయడంతో పాటు లైటింగ్, సౌండ్ సిస్టం, ఎల్ఈడీ స్క్రీన్లను అందుబాటులో ఉంచారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జన ప్రక్రియను పర్యవేక్షించారు. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

**గజ ఈతగాళ్లు.. వైద్య బృందాలు సిద్ధం**

మానకొండూరు, కొత్తపల్లి, చింతకుంట నిమజ్జన కేంద్రాల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించేలా వైద్య సిబ్బంది, మున్సిపల్ సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచారు. నిమజ్జన కేంద్రాల పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు.

**కొత్తపల్లి, చింతకుంటలో సౌకర్యాలు**

కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కొత్తపల్లి, చింతకుంట ప్రాంతాల్లో నిమజ్జన కేంద్రాలను సిద్ధం చేశారు. భక్తులు, ఉత్సవ కమిటీలకు తాగునీరు, విద్యుత్, లైటింగ్, పారిశుద్ధ్యం తదితర సౌకర్యాలు కల్పించారు.

**హుజురాబాద్ డివిజన్‌లోనూ వైభవంగా**

హుజురాబాద్, జమ్మికుంటతో పాటు ఆయా మండలాలు, గ్రామాల్లోనూ వినాయక నిమజ్జన వేడుకలు ఘనంగా జరిగాయి. చొప్పదండి ప్రాంతంలోనూ భక్తులు శోభాయాత్రలు నిర్వహించి గణనాథులకు వీడ్కోలు పలికారు.

**భారీ బందోబస్తు.. నిరంతర పర్యవేక్షణ**

నిమజ్జనోత్సవాల సందర్భంగా కరీంనగర్ నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లు, శోభాయాత్ర మార్గాలు, నిమజ్జన కేంద్రాల వద్ద సిబ్బందిని మోహరించి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ కిందిస్థాయి సిబ్బందికి సూచనలు చేశారు. జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ, నగరపాలక సంస్థ, మున్సిపాలిటీలు, వైద్య, పారిశుద్ధ్య, రెవెన్యూ తదితర శాఖల సమన్వయంతో నిమజ్జన కార్యక్రమాలు సజావుగా సాగాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలికారు.



## ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** రాజాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో 2026 ఆగస్టు 13వ తేదీ వరకు కొత్తగా పట్టా పాస్‌బుక్ పొందిన రైతులకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ నిర్వహించినట్లు ఏఓ రాజ్‌కుమార్ తెలిపారు. కొత్తగా పట్టా పాస్‌బుక్ పొందిన రైతులందరూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే యూరియా యాప్‌లో భూమి వివరాలు కనిపించవని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే వివిధ పథకాలు పొందేందుకు కూడా ఫార్మర్ రిజిస్ట్రేషన్ ముఖ్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో రాజా పూర్ సర్పంచ్ కొంకటి రవి, పంచాయతీ కార్యదర్శి, రైతులు పాల్గొన్నారు

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**శెనార్తి మీడియా, శంకరపట్నం:** మండలంలోని గద్దపాక, కరీంపేట, కొత్తగట్టు, తాడికల్ గ్రామపంచాయతీ కార్యాలయాల ఆవరణలో తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన స్మార్ట్ రేషన్ కార్డులను గురువారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు లబ్ధిదారులకు మరింత సులభంగా అందుతాయని తెలిపారు. కార్డులను ప్రతి ఒక్కరూ భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొయ్యడ పరుశరాములు, ఉపసర్పంచ్ జంగా జైపాల్, గ్రామ పాలకవర్గ సభ్యులు, పంచా యతీ కార్యదర్శి తిరుపతి, జీపీఓ తిరుపతి, గ్రామస్తులు పాల్గొన్నారు.




## వైభవంగా సాగుతున్న నిమజ్జనం

**శెనార్తి మీడియా, సిరిసిల్ల:**

గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వేములవాడ పట్టణంలో గురువారం వినాయక నిమజ్జన వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ గుడి చెరువు బండ్ పార్క్ వద్ద శోభాయాత్ర, నిమజ్జన వేడుకలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ గితెతో కలిసి వినాయకుడికి పూజలు చేసి ప్రారంభించారు. నిమజ్జన స్థలం వద్ద అధికారులకు పలు సూచనలు చేశారు.

## ఘనంగా విజన్ హైస్కూల్ వినాయక నిమజ్జనం



**శెనార్తిమీడియా, కరీంనగర్:**

కొత్తపల్లి మండలం రేకుర్తి విజన్ హైస్కూల్ లో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా విద్యార్థులందరూ తొమ్మిది రోజులు వినాయకునికి ఘనంగా పూజలు చేసి గురువారం ఆటపాటలతో కొత్తపల్లి చెరువులో వినాయకుని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్, డైరెక్టర్ సందవేణి వెంకట్, టీచర్స్ పాల్గొన్నారు

## వినాయక నిమజ్జన వేడుకల్లో ఒగ్గు దామోదర్

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**

మండల కేంద్రంలో యంగ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జన వేడుకల్లో పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్ పాల్గొన్నారు. యూత్ సభ్యుల ఆహ్వానం మేరకు కార్యక్రమానికి హాజరైన ఆయన వినాయకుడిని దర్శించుకున్నారు. వినాయకుని ఆశీస్సులు మండల ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. నిమజ్జన ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తూ క్షేమంగా వేడుకలను నిర్వహించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కత్తి రమేశ్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అక్కరవేణి పోచయ్య, ఆయిలేని నారాయణ రెడ్డి, నరసింహా రెడ్డి, బోనగం రమేశ్, లోనే నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు



## గన్నేరువరంలో ఘనంగా వినాయక నిమజ్జనం





**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండల పరిధిలోని గ్రామాల్లో గురువారం వినాయక నిమజ్జన వేడుకలను భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళలు కోలాటాలు ఆడుతూ భక్తి పరవశంతో నిమజ్జన శోభాయాత్రలో పాల్గొన్నారు. మండల కేంద్రంలో వివిధ వినాయక మండపాల నుంచి నిమజ్జనానికి విగ్రహాలను శోభాయాత్రగా తరలించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహిస్తూ ఉత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరికలు

**శెనార్తి మీడియా, గన్నేరువరం:**

గన్నేరువరం మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు బోయిన మల్లయ్య గురువారం మానకొండూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ ఆయనకు కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి, ముదిరాజ్ గ్రామ కార్యదర్శి కూన కనకయ్య, పాకాల పరశురాం, కూన కొమురయ్య, రంగన్న వేణి వీరయ్య, దానవేని పరుశురాం, రంగనవేని రాజేశం, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





## దుర్గపు సుజాత కుటుంబానికి మంత్రి పొన్నం పరామర్శ

**శెనార్తి మీడియా, శంకరపట్నం:** తాడికల్ గ్రామ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు దుర్గపు సుజాత ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం పరామర్శించారు. తాడికల్‌లోని ఆమె నివాసానికి వెళ్లిన మంత్రి, సుజాత చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి దుర్గపు సుజాత అందించిన సేవలను మంత్రి గుర్తుచేశారు. పార్టీ పట్ల అంకితభావంతో పనిచేసిన ఆమె సేవలు చిరస్మరణీయమని అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామ అభివృద్ధికి ఆమె చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు. సుజాత కుమారుడు, కుమార్తె చదువుల వివరాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. వారు బాగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## రజక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దీటి రాజు

**శెనార్తి మీడియా, బెజ్జంకి:**



తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి రజక సంఘం సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా దీటి రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ గణేష్, జిల్లా అధ్యక్షుడు జంగపల్లి ఐలయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. సిద్దిపేట జిల్లాలోని అన్ని మండలాల రజక కుల బాంధవులకు, ముఖ్యంగా బెజ్జంకి మండలంతో పాటు తన గ్రామానికి చెందిన రజక అన్నదమ్ములకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వర్తిస్తానన్నారు. రజక జాతి ఐక్యత, అభివృద్ధి, హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రతి రజక కుటుంబానికి అండగా నిలుస్తూ సమాజ అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానన్నారు. "ఒక్కటై నిలుద్దాం.. హక్కుల కోసం పోరాడుదాం.. రజక జాతి అభివృద్ధి కోసం కలిసి ముందుకు సాగుదాం" అని పిలుపునిచ్చారు



# బహుభాషా కోవిదుడు చక్రపాణి

## నేడు "చందమామ" చక్రపాణి వర్ధంతి

ఆలూరు వెంకట సుబ్బారావు అనే పేరు చాలా మంది విని ఉండక పోవచ్చు. "చక్రపాణి' అనే కలం పేరు కలిగిన వ్యక్తిగా చాలా మందికి తెలియక పోవచ్చు. చందమామ అనగానే వెంటనే గుర్తు వచ్చే పేరు చక్రపాణిదే. పిల్లల నుండి పండు ముదుసలి వరకు చదవడం వచ్చిన ప్రతి ఒక్కరూ చందమామ ఎప్పుడో ఒకప్పుడు చదివే ఉంటారనడం అతిశయోక్తి కాదు. దేశం స్వాతంత్ర్యం పొందడానికి ఒక నెల రోజుల ముందే చక్రపాణి, నాగిరెడ్డితో కలసి1947 జూలై లో పిల్లల కోసం చందమామ కథల పుస్తకం ప్రారంభిం చాడు. అయితే చందమామ స్థాపించాలనే ఆలోచన పూర్తిగా చక్రపాణిదే. సున్నిత హాస్యంతో, విజ్ఞాన, వినోదాత్మకమైన చక్కటి కథల తో ఆబాల గోపాలన్ని అలరించిన చందమామ పత్రికకు 1975లో చక్ర పాణి మరణించే వరకు సంపాదకుడిగా కొనసాగాడు. ఆలూరు వెంకట సుబ్బారావు (కలం పేరు చక్రపాణి) బహుభాషావేత్త, తెలుగు రచయిత, పత్రికా సంపాదకుడు, సినీ నిర్మాత, దర్శకుడు. చందమామ- విజయా కంబైన్స్ నిర్మాణ సంస్థ స్థాపకుల్లో ఒకడు. గుంటూరు జిల్లా తెనాలిలో 1908, ఆగష్టు 5 న గురవయ్య, వెంకమ్మ దంపతులకు జన్మించిన చక్రపాణి జాతీయోద్యమ ప్రభావానికి లోనై ఉన్నత పాఠశాల విద్యకు స్వస్తి చెప్పి, యలమంచిలి వెంకటప్పయ్య వద్ద హిందీ భాషను అభ్యసించి, హిందీ భాషా వ్యాప్తికి ఎనలేని కృషి సాగిస్తున్న వ్రజనందన వర్మ వద్ద హిందీ భాషలో మంచి పాండిత్యాన్ని గడించాడు. 'చక్రపాణి' అనే కలం పేరును ఆయనే ప్రసాదించాడు.

చక్రపాణి స్వయం కృషితో సంస్కృతం, ఇంగ్లీషు భాషలలో పరిచయాన్ని పొందాడు. క్షయ వ్యాధిగ్రస్తుడై 1932 లో మదనపల్లె లోని శానిటోరియంలో వైద్యం కోసం అక్కడే కొన్ని నెలలు ఉండి, సాటి రోగి అయిన ఒక పండితుని సాయంతో బెంగాలీ భాష కూడా నేర్చుకొన్నాడు. అలా బెంగాలీ నవలలను తెలుగు లోకి అనువదించడం ప్రారంభించాడు. ముఖ్యంగా శరత్‌బాబు నవలలను ఆయన అనువాదం ఎంత బాగా చేశాడంటే, ఆ పుస్తకాల మూలం బెంగాలీ అంటే నమ్మనంతగా చేశాడు. వాగ్దత్త, సుభద, పల్లీయులు, చంద్రనాథ్, దేవదాస్, పరిణీత, నవ విధాన్, బడాదీది, పతివ్రత, హేమాంగిని, నిష్కృతి, మా వారు, వంటి శరత్ రచనలను తెలుగులో అనువదించారు. తెలుగులో చిన్న చిన్న కథలు, నవలలు కూడా రాశాడు. చక్రపాణి రచయితగా, అనువాదకుడిగా పేరు సంపాదించి సినిమా అవకాశాలు రాగా, 1940 లో ముంబైలోని ఫేమస్ ఫిలింస్ వారి ధర్మపత్ని కోసం ముందుగా మాటలు రాశాడు. 1945లో బి.ఎన్. రెడ్డి, మూలా నారాయణస్వామి కలిసి వాహినీ సంస్థ బ్యానర్ మీద 'స్వర్గసీమ' నిర్మిస్తూ కథ, సంభాషణల రచన కోసం చక్రపాణిని పిలిపించారు. చిత్తూరు నాగయ్య హీరోగా, జయమ్మ నాగయ్య భార్యగా, భానుమతి సుజాతా దేవిగా నటించగా ఘంటసాల గాయకుడుగా వెండితెరకు పరిచయమైన చిత్రం "స్వర్గసీమ" బహుళ జనాదరణ పొందింది.

1949లో చక్రపాణికి బి.ఎన్.కె ప్రెస్ లో బి.నాగిరెడ్డి తో స్నేహం కలవడం, జీవితాంతం ఆ స్నేహం అనురాగ బంధంగా బలపడటం, ఇద్దరు కలసి విజయా ప్రొడక్షన్స్ స్థాపించి, సినిమాలు తీయాలని నిర్ణయించడం జరిగింది. తొలి ప్రయత్నంగా 'షావుకారు' (1950) చిత్రాన్ని ఎల్.వి. ప్రసాద్ దర్శకత్వంలో నిర్మించింది. ఈ సినిమాకి కథ, సంభాషణలు చక్రపాణి సమకూర్చారు. 1951 లో అఖండ విజయం సాధించిన 'పాతాళ భైరవి' చిత్రాన్ని నిర్మించి, తర్వాత వాహినీ స్టుడియోలో తెలుగు, తమిళ, కన్నడ, హిందీ భాషలలో దాదాపు 35 చలన చిత్రాలను రూపొందించారు. విజయా ప్రొడక్షన్స్ క్రింద మాయా బజార్, గుండమ్మ కథ, మిస్సమ్మ, సి.ఐ.డి. అప్పు చేసి పప్పు కూడు లాంటి అజరామరాలైన సినిమాలు తీశారు. "మనం తీసేది జనం చూడ్డం కాదు జనం కోరేది మనం తీయాలి " అనే ధోరణి ఆయనది. 1934-1935 లో కొడవటిగంటి కుటుంబరావుతో కలసి తెనాలిలో యువ మాసపత్రికను మంచి అభిరుచిగల తెలుగు పాఠకుల కోసం ప్రారంభించాడు. ఈ పత్రికను చక్రపాణి 28 సంవత్సరాలు నడపగా కుటుంబరావు దానికి సంపాదకుడుగా వ్యవహరించారు. 1939 లో సి.పుల్లయ్య ధర్మపత్ని సినిమాకు కథ సమకూర్చాడు. శ్రీరాజేశ్వరి విలాస్ కాఫీ క్లబ్ చిత్రానికి కథ చక్రపాణి రాశాడు. ఆ సినిమా విడుదల కాకుండానే సెప్టెంబరు 24, 1975 న చక్రపాణి కన్ను మూశాడు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

# కేసు నమోదైతే నేరం రుజువైనట్టేనా?

### పోక్సోపై అపోహలు-వాస్తవాలు

### నిందితుడా.. నిర్దోషియా? పోక్సో కేసుల్లో నిజానిజాల తూకం

బాల్యం అంటే బరువులేని నవ్వు. భయానికి చోటులేని ప్రపంచం. అమ్మ ఒడిలోనో, నాన్న చేయిపట్టుకునో, పాఠశాల ప్రాంగణంలోనో, స్నేహితుల మధ్యనో పిల్లలు తమను తాము సురక్షితంగా భావించాలి. కానీ బాలలపై లైంగిక నేరాల ఘటనలు వెలుగులోకి వస్తున్నకొద్దీ ఆ భద్రతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో 'పోక్సో' కేసులు వార్తల్లో తరచుగా కనిపిస్తున్నాయి. అయితే ప్రతి కేసు వెనుక ఒక వాస్తవాన్ని, ప్రతి ఆరోపణ వెనుక ఒక దర్యాప్తు ప్రక్రియను, ప్రతి బాలుడి వెనుక ఒక భవిష్యత్తును చూడాల్సిన బాధ్యత సమాజానిదే. పిల్లలను లైంగిక నేరాల నుంచి రక్షించేందుకు 2012లో అమల్లోకి వచ్చిన 'ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్' చట్టాన్నే పోక్సో చట్టంగా వ్యవహరిస్తారు. 18 సంవత్సరాల లోపు వారిని ఈ చట్టం పరిధిలో పిల్లలుగా పరిగణిస్తుంది. లైంగిక దాడి, లైంగిక వేధింపులు, పిల్లలను అశ్లీల ప్రయోజనాలకు ఉపయోగించడం వంటి నేరాలను ఈ చట్టం ప్రత్యేకంగా నిర్వచిస్తుంది. బాలల రక్షణకు అనుగుణంగా వాంగ్మూలం, వైద్య పరీక్ష, విచారణ, ప్రత్యేక న్యాయస్థానాల విషయంలోనూ చట్టం ప్రత్యేక నిబంధనలు కల్పించింది.

తాజాగా అందుబాటులో ఉన్న అధికారిక 'క్రైమ్ ఇన్ ఇండియా-2023' గణాంకాలు సమస్య తీవ్రతను అర్థం చేసుకోవడానికి ముఖ్యమైన ఆధారం. దేశవ్యాప్తంగా 2023లో పోక్సో చట్టం కింద 67,694 కేసులు నమోదయ్యాయి. అయితే ఈ సంఖ్యను 'అంతమంది నేరస్తులు'గా అర్థం చేసుకోవడం పూర్తిగా తప్పు. కేసు నమోదు అనేది ఆరోపణపై చట్టపరమైన ప్రక్రియకు శ్రీకారం మాత్రమే; దర్యాప్తు, ఆధారాల సేకరణ, అభియోగపత్రం, విచారణ, తీర్పు వంటి తదుపరి దశలు ఉంటాయి. అంతేకాదు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు అందించిన సమాచారంపై చీజ=దీ గణాంకాలు ఆధారపడతాయి. కాబట్టి రాష్ట్రాల మధ్య కేసుల సంఖ్యను మాత్రమే ఆధారంగా చేసుకుని నేర తీవ్రతను పోల్చరాదని అధికారిక గణాంక వ్యవస్థ స్పష్టం చేస్తోంది.

ఇక్కడ ఒక ముఖ్యమైన అపోహను తొలగించుకోవాలి. పోక్సో కేసు నమోదైతే నేరం రుజువైనట్టే అన్నది అవాస్తవం. ఆరోపణ ఎదుర్కొంటున్న వ్యక్తి దోషిగా నిర్ధారించబడే వరకు చట్టపరంగా నిందితుడిగానే ఉంటాడు. అదే సమయంలో ఫిర్యాదు నమోదైందంటే అది అబద్ధమని కూడా ముందుగానే తేల్చలేం. ప్రతి ఫిర్యాదును చట్టబద్ధంగా, నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలి. నిజానిజాలను నిర్ణయించేది సాక్ష్యాలు, దర్యాప్తు, న్యాయపరిశీలన.

'పిల్లకు నిందితుడు పరిచయం ఉన్నాడంటే అది నేరం కాదేమో' అనే అపోహ కూడా ప్రమాదకరమే. చీజ=దీ ప్రత్యేకంగా సేకరించిన 2023 గణాంకాల్లో పోక్సో







కేసుల్లో నిందితుడు-బాధితుడి సంబంధాన్ని నమోదు చేసింది. అంటే పిల్లలకు తెలిసిన వ్యక్తులు కూడా కేసుల్లో నిందితులుగా ఉండే సందర్భాలు నమోదవుతున్నాయి. దీనికి విరుద్ధంగా 'ప్రతి పరిచయస్తుడూ ప్రమాదకరుడు' అనే నిర్ణయానికి రావడం కూడా సరికాదు. సంబంధం ఒక్కటే నేరాన్ని నిర్ధారించదు; ఘటనకు సంబంధించిన వాస్తవాలు, సాక్ష్యాలు, చట్టపరమైన ప్రమాణాలే నిర్ణయాత్మకం.

ఇంకొక సున్నితమైన అంశం ప్రేమ, వివాహ వాగ్దానం, కుటుంబ వ్యతిరేకత, వ్యక్తిగత కలహాలు వంటి నేపథ్యాలు. కొన్ని కేసుల్లో ఇలాంటి అంశాలు ఆరోపణల నేపథ్యంగా కనిపించవచ్చు. కొన్ని ఆరోపణలు దర్యాప్తులో నిలవకపోవచ్చు; మరికొన్నింటిలో నేరం నిరూపితమవుతుంది. కాబట్టి కుటుంబ విభేదం ఉందని మాత్రమే ఆరోపణను కల్పితమని, లేదా ప్రేమ సంబంధం ఉందని మాత్రమే లైంగిక నేరం జరగలేదని చెప్పడం న్యాయపరంగా సరైన విధానం కాదు. ప్రతి కేసును దాని స్వతంత్ర వాస్తవాల ఆధారంగా పరిశీలించాల్సిందే.

తెలుగు రాష్ట్రాల నేపథ్యంలోనూ ఇదే జాగ్రత్త అవసరం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో పోక్సోకు సంబంధించిన ప్రత్యేక న్యాయస్థానాల్లో కేసులు విచారణకు వస్తున్నాయి. తెలంగాణ హైకోర్టు తీర్పుల్లో పోక్సో చట్టం కింద నమోదైన కేసులు, నిందితుల అప్పీలు, సాక్ష్యాలపై వాదనలు, ప్రత్యేక న్యాయస్థానాల తీర్పులు వంటి అనేక అంశాలు నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పుల్లోనూ పోక్సో చట్టానికి సంబంధించిన కేసులు కనిపిస్తాయి. అయితే ఒక్కో న్యాయస్థాన తీర్పును మొత్తం రాష్ట్రంలోని కేసుల పరిస్థితికి ప్రతినిధిగా పరిగణించడం సరికాదు.

అసలు ప్రశ్న 'కేసులు ఎందుకు నమోదవుతున్నాయి?' అన్నదొక్కటే కాదు; 'పిల్లలకు ప్రమాదం కలగకుండా ముందుగానే ఏం చేయాలి?' అన్నదే ముఖ్యమైనది. ఇంట్లో పిల్లలతో స్నేహపూర్వక సంభాషణ ఉండాలి. శరీరానికి సంబంధించిన వ్యక్తిగత హద్దులు, అనుచిత స్పర్శ, అసౌకర్యం కలిగించే ప్రవర్తన గురించి వయసుకు తగిన భాషలో అవగాహన కల్పించాలి. "ఎవరైనా పెద్దవారే కాబట్టి తప్పకుండా నమ్మాలి" అనే భావనకు బదులుగా, అసౌకర్యం కలిగితే 'వద్దు' అని చెప్పే హక్కు పిల్లలకు ఉందని నేర్పాలి. ఏదైనా సంఘటన ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా విశ్వసనీయ పెద్దలకు చెప్పే వాతావరణం కల్పించాలి.

పాఠశాలల బాధ్యత మరింత కీలకం. ఉపాధ్యాయులు, బస్సు సిబ్బంది, వసతి గృహ సిబ్బంది, క్రీడా శిక్షకులు, వ్యవహరించే సందర్భాల్లో పారదర్శకమైన విధానాలు పాటించడం, ఫిర్యాదు వచ్చినప్పుడు దానిని దాచిపెట్టకుండా చట్టబద్ధంగా స్పందించడం అత్యవసరం.

ఘటన జరిగినట్లు అనుమానం వచ్చినప్పుడు తల్లిదండ్రులు చేయాల్సిన మొదటి పని పిల్లను నిందించడం కాదు, వినడం. "నువ్వే ఎందుకు అక్కడికి వెళ్లావు?", "ముందే ఎందుకు చెప్పలేదు?" వంటి ప్రశ్నలు పిల్లలో మరింత భయాన్ని కలిగించవచ్చు. ఒకే విషయాన్ని పదేపదే ప్రశ్నించడం ద్వారా పిల్లవాడి వాంగ్మూలంపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. అందువల్ల శిక్షణ పొందిన అధికారులు, వైద్య సిబ్బంది, బాలల రక్షణ వ్యవస్థల సహకారం తీసుకోవాలి. తక్షణ ప్రమాదం ఉంటే పోలీసు లేదా సంబంధిత బాలల రక్షణ అధికారులను సంప్రదించాలి.

సామాజిక మాధ్యమాలు మరో ప్రమాదాన్ని సృష్టిస్తున్నాయి. ఒక కేసు వెలుగులోకి రాగానే నిందితుడి ఫొటోలు, బాధిత బాలుడి వివరాలు, పాఠశాల పేరు, కుటుంబ వివరాలు, ధృవీకరించని ఆరోపణలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడం బాధితుడి భవిష్యత్తుకు తీవ్ర నష్టం కలిగించవచ్చు. బాలుడి గౌరవం, గోప్యతను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. వార్తా సంస్థలు కూడా సంచలనాత్మక శీర్షికల కన్నా వాస్తవ నిర్ధారణకు ప్రాధాన్యం ఇవ్వాలి.

పోక్సో కేసులపై చర్చలో మరో సమతుల్యత అవసరం. తప్పుడు కేసుల ఆరోపణలను పూర్తిగా విస్మరించలేం; అదే సమయంలో తప్పుడు ఆరోపణల పేరుతో నిజమైన బాధితుల గొంతును మూయించలేం. న్యాయం అంటే ఒకరిని నిందించడం కాదు; వాస్తవాన్ని సాక్ష్యాల ద్వారా వెలికితీసి, బాధితుడికి రక్షణ కల్పిస్తూ, నిందితుడికి కూడా చట్టబద్ధమైన న్యాయ ప్రక్రియను అందించడం. ఇదే న్యాయవ్యవస్థ యొక్క మౌలిక సూత్రం.

బాల్యం పచ్చని చిగురు. దానిపై పడిన గాయం కంటికి కనిపించకపోయినా మనసులో మిగిలిపోవచ్చు. అందుకే పోక్సో చట్టాన్ని కేవలం శిక్షించే చట్టంగా కాకుండా బాలల రక్షణకు ఒక సామాజిక భద్రతా కవచంగా చూడాలి. కేసు నమోదైన ప్రతి సందర్భాన్ని సంచలనంగా కాకుండా బాధ్యతగా చూడాలి. ఆరోపణను నిజమని ముందే తీర్పు చెప్పకూడదు; అబద్ధమని కూడా ముందే కొట్టిపారేయకూడదు. పిల్లల మాట వినాలి, సాక్ష్యాలను గౌరవించాలి, చట్టాన్ని పాటించాలి, గోప్యతను కాపాడాలి. కుటుంబం అప్రమత్తంగా ఉంటే, పాఠశాల బాధ్యతగా వ్యవహరిస్తే, అధికారులు సున్నితంగా స్పందిస్తే, సమాజం అపోహలకు బదులుగా అవగాహనను ఎంచుకుంటేనే బాల్యానికి నిజమైన రక్షణ లభిస్తుంది. "బాల్యం భద్రమైతేనే భావి భారతం భద్రం" అనే సత్యాన్ని మాటల్లో కాకుండా చేతల్లో చూపించాల్సిన సమయం ఇదే.




# ప్రహ్లాద యూత్ విఘ్నేశ్వరుడిని దర్శించుకున్న మేయర్ కొలగాని



నగరంలోని హౌసింగ్ బోర్డు కాలనీ రోడ్ నంబర్ 4లో ప్రహ్లాద యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వర మండపాన్ని కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్ సోమవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మండపం నిర్వాహకులు, కాలనీ పెద్దలు మేయర్‌కు స్వాగతం పలికారు. అనంతరం విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పూజల అనంతరం మండపం నిర్వాహకులు మేయర్‌ను సన్మానించారు.

శెనార్తి మీడియా, కరీంనగర్:





# మహిళల స్కీట్ టీమ్‌కు కాంస్యం




**నాగోయా, సెప్టెంబరు 23 :** జపాన్‌లో జరుగుతున్న 2026 ఆసియా క్రీడల్లో భారత షూటర్లు మరోసారి సత్తా చాటారు. మహిళల స్కీట్ టీమ్ ఈవెంట్‌లో రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్, పరినాజ్ ధలివాల్‌తో కూడిన భారత జట్టు కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది. ముగ్గురు షూటర్లు సమష్టిగా నిలకడైన ప్రదర్శన చేయడంతో భారత్ పతకాల పట్టికలో మరో పతకాన్ని జత చేసుకుంది. మహిళల స్కీట్ టీమ్ పోటీలో భారత బృందం అర్హత దశలో 331 పాయింట్లు సాధించి మూడో స్థానంలో నిలిచింది. చైనా జట్టు 357 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచి స్వర్ణ పతకాన్ని దక్కించుకోగా.. కజకిస్థాన్ 336 పాయింట్లతో రజతాన్ని సాధించింది. భారత షూటర్లు చివరి వరకు పోరాడి మూడో స్థానాన్ని నిలబెట్టుకోవడంతో కాంస్య పతకం ఖరారైంది. రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్, పరినాజ్ ధలివాల్ ముగ్గురూ పోటీలో తమ వంతు ప్రదర్శనను సమర్థంగా పూర్తి చేశారు. ముఖ్యంగా కీలక దశల్లో లక్ష్యాలను ఛేదించడంలో చూపిన నిలకడ భారత జట్టుకు ఉపయోగపడింది. ఆసియా క్రీడల్లో మహిళల స్కీట్ టీమ్ విభాగంలో భారత్‌కు లభించిన ఈ పతకం ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ విజయంతో ఆసియా క్రీడల్లో భారత షూటింగ్ బృందం ఖాతాలో మరో పతకం చేరింది. ఇప్పటికే షూటింగ్‌లో భారత క్రీడాకారులు పలు విభాగాల్లో పతకాలు సాధించగా.. మహిళల స్కీట్ టీమ్ కాంస్యంతో ఆ సంఖ్య ఆరుకు చేరింది. వరుసగా పతకాలు సాధిస్తుండటంతో భారత షూటర్ల ప్రదర్శనపై అంచనాలు మరింత పెరిగాయి. మొత్తంగా 2026 ఆసియా క్రీడల్లో భారత్ సాధించిన పతకాల సంఖ్య ఎనిమిదికి చేరింది. ఇందులో ఒక స్వర్ణం, నాలుగు రజతాలు, మూడు కాంస్య పతకాలు ఉన్నాయి. ఆసియా క్రీడల పోటీలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో భారత్ నుంచి మరిన్ని పతకాలు వస్తాయని క్రీడాభిమానులు ఆశిస్తున్నారు. షూటింగ్‌తో పాటు ఇతర క్రీడాంశాల్లోనూ భారత అథ్లెట్లు తమ ప్రతిభను చాటేందుకు బరిలోకి దిగుతున్నారు. మహిళల స్కీట్ టీమ్ సాధించిన ఈ కాంస్య పతకం భారత షూటింగ్ బృందానికి మరింత ఉత్సాహాన్ని అందించనుంది. రాబోయే పోటీల్లోనూ భారత షూటర్లు మెరుగైన ప్రదర్శనతో మరిన్ని పతకాలు సాధించేందుకు ప్రయత్నించనున్నారు.

# రషీద్ ఖాన్‌ను వెనక్కి నెట్టిన అబ్రార్



**దుబాయ్, సెప్టెంబరు 23 :** ఐసీసీ తాజాగా విడుదల చేసిన టీ20 బౌలర్ల ర్యాంకింగ్స్‌లో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ నంబర్ వన్ స్థానాన్ని కోల్పోగా.. పాకిస్థాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్ ఎలాంటి మ్యాచ్ ఆడకుండానే అగ్రస్థానానికి చేరుకున్నాడు. 736 రేటింగ్ పాయింట్లతో అబ్రార్ నంబర్ వన్ టీ20 బౌలర్‌గా నిలిచాడు. ఇటీవల భారత్‌తో జరిగిన మూడో టీ20లో రషీద్ ఖాన్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో నాలుగు ఓవర్లు వేసిన అతడు 43 పరుగులు ఇచ్చాడు. ఈ ప్రదర్శనతో రేటింగ్ పాయింట్లు తగ్గడంతో 735 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోయాడు. అబ్రార్ అహ్మద్ ఫిబ్రవరి తర్వాత అంతర్జాతీయ టీ20 మ్యాచ్ ఆడలేదు. అయినప్పటికీ రషీద్ పాయింట్లు తగ్గడంతో అబ్రార్‌కు అగ్రస్థానం దక్కింది. ఆస్ట్రేలియా స్పిన్నర్ ఆడమ్ జంపా 700 పాయింట్లతో మూడో స్థానంలో ఉండగా.. ఇంగ్లండ్ స్పిన్నర్ ఆదిల్ రషీద్ నాలుగో స్థానంలో, ఆస్ట్రేలియా బౌలర్ నాథన్ ఎల్లిస్ ఐదో స్థానంలో ఉన్నారు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి అత్యుత్తమ స్థానంలో కొనసాగుతున్నాడు. అఫ్గానిస్థాన్‌తో జరిగిన చివరి టీ20కి గాయం కారణంగా దూరమైన వరుణ్.. టాప్-5 నుంచి ఏడో స్థానానికి పడిపోయాడు. మరోవైపు ఇంగ్లండ్ ఆటగాడు జేమీ ఓవర్టన్ 47 స్థానాలు ఎగబాకి ఆరో స్థానానికి చేరుకున్నాడు. భారత ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ 12 స్థానాలు మెరుగుపరుచుకుని 639 రేటింగ్ పాయింట్లతో 15వ స్థానంలో నిలిచాడు.

# టీ20ల్లో భారత్ 200వ విజయం



**నాగోయా, సెప్టెంబరు 23 :** అంతర్జాతీయ టీ20 క్రికెట్‌లో టీమిండియా సరికొత్త చరిత్ర సృష్టించింది. జపాన్‌తో జరిగిన ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో రెండు పరుగుల తేడాతో విజయం సాధించడం ద్వారా భారత్ అంతర్జాతీయ టీ20ల్లో 200 విజయాలు పూర్తి చేసుకున్న తొలి జట్టుగా నిలిచింది. ఈ క్రమంలో పాకిస్థాన్‌తో పాటు ఇతర అంతర్జాతీయ జట్లను వెనక్కి నెట్టి అరుదైన ఘనతను సాధించింది. 291 మ్యాచ్‌లు.. 200 విజయాలు: 2006లో అంతర్జాతీయ టీ20 ప్రయాణాన్ని ప్రారంభించిన భారత్ ఇప్పటివరకు 291 మ్యాచ్‌లు ఆడింది. ఇందులో ఏకంగా 200 మ్యాచ్‌ల్లో విజయం సాధించింది. 81 మ్యాచ్‌ల్లో ఓటమి ఎదుర్కొన్న భారత్.. ఒక మ్యాచ్‌ను టైగా ముగించగా, మరో తొమ్మిది మ్యాచ్‌ల్లో ఫలితం తేలలేదు. అంతర్జాతీయ టీ20ల్లో ఇంతటి విజయాల సంఖ్యను సాధించిన తొలి జట్టుగా భారత్ రికార్డు సృష్టించింది. పాక్‌కు 24 విజయాల ఆధిక్యం: అంతర్జాతీయ టీ20ల్లో అత్యధిక విజయాలు సాధించిన జట్ల జాబితాలో పాకిస్థాన్ 176 విజయాలతో రెండో స్థానంలో ఉంది. పాకిస్థాన్ 2005 నుంచి ఇప్పటివరకు 303 టీ20 మ్యాచ్‌లు ఆడింది. భారత్ ప్రస్తుతం పాక్ కంటే 24 విజయాల ఆధిక్యంలో ఉంది. ఇంగ్లాండ్ దేశవాళీ జట్లలో సోమర్సెట్ 174 విజయాలతో తర్వాతి స్థానంలో ఉండగా.. లాంకషైర్ 166 విజయాలు సాధించింది. ఐపీఎల్‌లో ముంబయి ఇండియన్స్ కూడా 166 విజయాలతో ఉంది. చెన్నై సూపర్ కింగ్స్, సర్రే జట్లు 163 విజయాలతో తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. జపాన్‌తో ఉత్కంఠ పోరు: 200వ విజయం సాధించిన మ్యాచ్‌లో మాత్రం టీమిండియాకు ఊహించని స్థాయిలో పోటీ ఎదురైంది. వర్షం కారణంగా మ్యాచ్‌ను ఐదు ఓవర్లకు కుదించారు. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 4 వికెట్ల నష్టానికి 32 పరుగులు మాత్రమే చేసింది. చిన్న లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన జపాన్ చివరి వరకు పోరాడింది. అయితే భారత బౌలర్లు కీలక సమయంలో వికెట్లు తీసి జపాన్‌ను 3 వికెట్లకు 30 పరుగులకే పరిమితం చేశారు. చివరి ఓవర్‌లో జపాన్ విజయానికి ఎనిమిది పరుగులు అవసరమైన సమయంలో భారత బౌలర్లు ఒత్తిడిని తట్టుకుని అద్భుతంగా బౌలింగ్ చేశారు. చివరి బంతి వరకు ఉత్కంఠ కొనసాగినా.. జపాన్ రెండు పరుగుల దూరంలో నిలిచిపోయింది. దీంతో భారత్ రెండు పరుగుల తేడాతో విజయం సాధించి 200వ అంతర్జాతీయ టీ20 విజయాన్ని నమోదు చేసింది. టీ20ల్లో భారత్ సాధించిన ఈ మైలురాయి ఆ ఫార్మాట్‌లో జట్టు సాధించిన స్థిరమైన విజయాలకు మరో గుర్తింపుగా నిలిచింది. ముఖ్యంగా 200వ విజయం కూడా అత్యంత ఉత్కంఠభరితమైన మ్యాచ్‌లో రావడంతో ఈ రికార్డు మరింత ప్రత్యేకంగా మారింది.

# భారత్‌తో టీ20 సిరీస్‌కు న్యూజిలాండ్ జట్టు

**క్రైస్ట్‌చర్చ్, సెప్టెంబరు 23 :** భారత్‌తో జరగనున్న ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌కు న్యూజిలాండ్ 16 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. స్పిన్ ఆల్‌రౌండర్ మిచెల్ శాంట్నర్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. ఏడాదికి పైగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్న ఫాస్ట్‌బౌలర్ ఆడమ్ మిల్నే తిరిగి జట్టులోకి రావడం ఈ ఎంపికలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఇటీవల జరిగిన టీ20 ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిచిన న్యూజిలాండ్ జట్టులోని 13 మంది ఆటగాళ్లకు ఈ సిరీస్‌లోనూ చోటు దక్కింది. అయితే స్టార్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర గాయం కారణంగా దూరమయ్యాడు. ఓ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో అతడి కుడి భుజానికి గాయమైంది. దీంతో టీ20 సిరీస్‌కు విశ్రాంతి ఇచ్చారు. వన్డే సిరీస్ నాటికి అతడు కోలుకుంటాడని జట్టు యాజమాన్యం భావిస్తోంది. టీ20 ప్రపంచకప్‌కు గాయం కారణంగా దూరమైన స్పిన్ ఆల్‌రౌండర్ మైఖేల్ బ్రేస్‌వెల్ కూడా తిరిగి జట్టులోకి వచ్చాడు. మరోవైపు భారత బ్యాటర్లను ఎదుర్కొనేందుకు న్యూజిలాండ్ బలమైన పేస్ దళాన్ని సిద్ధం చేసింది. జట్టులో ఆడమ్ మిల్నేతో పాటు లాకీ ఫెర్గూసన్, మాట్ హెన్రీ, కైల్ జేమీసన్, జాకబ్ డఫ్ఫీ, జాక్ ఫౌల్క్స్, నాథన్ స్మిత్ ఉన్నారు. భారత్-న్యూజిలాండ్ టీ20 సిరీస్ అక్టోబరు 22న క్రైస్ట్‌చర్చ్‌లోని హగ్లీ ఓవల్‌లో తొలి మ్యాచ్‌తో ప్రారంభం కానుంది. అనంతరం ఇరు జట్ల మధ్య వన్డే, టెస్టు సిరీస్‌లు కూడా జరగనున్నాయి. న్యూజిలాండ్ టీ20 జట్టు: మిచెల్ శాంట్నర్ (కెప్టెన్), ఫిన్ అలెన్, మైఖేల్ బ్రేస్‌వెల్, మార్క్ చాప్‌మన్, డెవాన్ కాన్వే, జాకబ్ డఫ్ఫీ, లాకీ ఫెర్గూసన్, జాక్ ఫౌల్క్స్, మాట్ హెన్రీ, బెవాన్ జాకబ్స్, కైల్ జేమీసన్, ఆడమ్ మిల్నే, డారిల్ మిచెల్, గ్లెన్ ఫిలిప్స్, టిమ్ సీఫెర్ట్, నాథన్ స్మిత్.



# మీరాబాయి మెడలో ఆసియా రజతం

## 49 కిలోల వెయిట్‌లిఫ్టింగ్‌లో అద్భుత ప్రదర్శన




**నగోయా (జపాన్), సెప్టెంబర్ 23 :** భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్ మీరాబాయి చాను ఎట్టకేలకు ఆసియా క్రీడల్లో పతకం సాధించారు. ఐచి--నగోయా ఆసియా క్రీడల్లో బుధవారం జరిగిన మహిళల 49 కిలోల విభాగంలో అద్భుత ప్రదర్శన చేసిన మీరాబాయి రజత పతకాన్ని సొంతం చేసుకున్నారు. స్నాచ్‌లో 87 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కిలోలతో మొత్తం 198 కిలోలు ఎత్తి రెండో స్థానంలో నిలిచారు. మీరాబాయి కెరీర్‌లో ఇదే తొలి ఆసియా క్రీడల పతకం. ఒలింపిక్స్‌లో రజతం.. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణం.. కామన్వెల్త్ క్రీడల్లో మూడు స్వర్ణాలు.. ఇలా ఎన్నో అంతర్జాతీయ విజయాలు సాధించిన మీరాబాయి ఖాతాలో ఆసియా క్రీడల పతకం మాత్రం ఇప్పటివరకు లేదు. 2014 ఇంచియాన్ ఆసియా క్రీడల్లో తొమ్మిదో స్థానంలో నిలిచిన ఆమె, 2018 జకార్తా క్రీడలకు వెన్ను గాయం కారణంగా దూరమయ్యారు. 2023 హాంగ్‌జౌ క్రీడల్లో నాలుగో స్థానంతో పతకాన్ని తృటిలో చేజార్చుకున్నారు. ఈసారి మాత్రం రజతంతో ఆ లోటును భర్తీ చేశారు. స్నాచ్‌లో 83 కిలోలతో పోటీ ప్రారంభించిన 32 ఏళ్ల మీరాబాయి తొలి ప్రయత్నాన్ని విజయవంతంగా పూర్తి చేశారు. రెండో ప్రయత్నంలో 85 కిలోలు, మూడో ప్రయత్నంలో 87 కిలోలను ఎత్తారు. దీంతో స్నాచ్ ముగిసే సమయానికి మూడో స్థానంలో నిలిచారు. క్లీన్ అండ్ జెర్క్‌లో 111 కిలోల అత్యుత్తమ లిఫ్ట్‌తో రెండో స్థానానికి దూసుకెళ్లి రజతాన్ని ఖాయం చేసుకున్నారు. మీరాబాయి రజతంతో ఆసియా క్రీడల వెయిట్‌లిఫ్టింగ్‌లో భారత్ 28 ఏళ్ల పతక నిరీక్షణకు తెరపడింది. చివరిసారిగా 1998 బ్యాంకాక్ ఆసియా క్రీడల్లో కరణం మల్లేశ్వరి రజత పతకం సాధించారు. ఆ తర్వాత ఈ విభాగంలో భారత్‌కు పతకం దక్కలేదు. ఇప్పుడు మీరాబాయి ఆ సుదీర్ఘ నిరీక్షణకు ముగింపు పలికారు. ఉత్తర కొరియాకు చెందిన రి సాంగ్ గమ్ అసాధారణ ప్రదర్శనతో స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. స్నాచ్‌లో 94 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 121 కిలోలతో మొత్తం 215 కిలోలు ఎత్తారు. స్నాచ్, క్లీన్ అండ్ జెర్క్, మొత్తం బరువు.. మూడు విభాగాల్లోనూ ప్రపంచ రికార్డులు నెలకొల్పారు. ఆసియా క్రీడల్లో ఆమెకు ఇది వరుసగా మూడో స్వర్ణ పతకం. ఇండోనేషియాకు చెందిన లులుక్ దయానా త్రి విజయానా 191 కిలోల మొత్తం బరువుతో కాంస్యం సాధించారు. ఆసియా క్రీడల పతకాన్ని తన ఖాతాలో చేర్చుకున్న మీరాబాయి చాను.. తన సుదీర్ఘ కెరీర్‌లో మిగిలిపోయిన ప్రధాన లోటును ఈ రజతంతో భర్తీ చేసుకున్నారు.



# పెళ్లి, మాతృత్వంపై శృతి హాసన్ సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్, సెప్టెంబరు 23 :** ప్రముఖ కథానాయిక శృతి హాసన్ తన వ్యక్తిగత జీవితం, ఆరోగ్యం మరియు మాతృత్వంపై పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. నటి సోహా అలీ ఖాన్ నిర్వహిస్తున్న 'ఆల్ అబౌట్ హర్' పాడ్‌కాస్ట్‌లో పాల్గొన్న ఆమె, వివాహ వ్యవస్థ మరియు తల్లికావడంపై తన అభిప్రాయాలను నిష్కపటంగా వెల్లడించారు. గతంలో తన జీవితంలో ఒకసారి వివాహం వరకు వెళ్లి చివరి నిమిషంలో నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు శృతి వెల్లడించారు. జీవిత భాగస్వామి తోడు కోరుకున్నప్పటికీ, పెళ్లి అనే చట్టబద్ధమైన వ్యవస్థలో ఇమిడిపోవడం తనకు ఇష్టం లేదని స్పష్టం చేశారు. ఆడంబరంగా పెళ్లిళ్లు చేసుకునే ఖర్చును అవసరంలో ఉన్నవారికి సాయం చేయడానికి ఉపయోగిస్తే ఎంతో మేలని, కేవలం కాగితాలపై సంతకాలు చేయడం కాకుండా ఇద్దరు వ్యక్తులు రోజూ ప్రేమతో కలసి ఉండటమే నిజమైన బంధమని పేర్కొన్నారు. చిన్నతనంలోనే పీసీఓఎస్ (పాలీసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్) సమస్యల కారణంగా భవిష్యత్తులో సంతానప్రాప్తి కష్టమని వైద్యులు చెప్పడంతో మాతృత్వం పట్ల తనకు ఎంతో భయం ఉండేదని శృతి తెలిపారు. అయితే ఇటీవల వైద్యుల సలహాలతో ఆ భయాలు వీడి, తల్లిగా మారాలనే కోరిక పెరిగిందని వెల్లడించారు. దీనికోసం పెళ్లి చేసుకోవాల్సిన అవసరం లేదని, దత్తత ద్వారా లేదా సాంకేతిక మార్గాల ద్వారా సొంత బిడ్డకు తల్లి అయ్యేందుకు సిద్ధంగా ఉన్నానని ఆమె స్పష్టం చేశారు.



# టాలీవుడ్ రీ-ఎంట్రీపై మలయాళ భామ కళ్యాణి ప్రియదర్శన్ చూపు

**హైదరాబాద్, సెప్టెంబరు 23 :** తక్కువ సినిమాలతోనే తెలుగు ప్రేక్షకుల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న మలయాళ నటి కళ్యాణి ప్రియదర్శన్, సరైన కథ లభిస్తే టాలీవుడ్‌లోకి మళ్లీ రీ-ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రముఖ దర్శకుడు ప్రియదర్శన్ కుమార్తెగా చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, తన సహజసిద్ధమైన నటనతో తెలుగు యూత్‌లో విశేషమైన అభిమాన గణాన్ని సంపాదించుకున్నారు.

## పరిమిత అవకాశాలు.. చెరగని ముద్ర

అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటించిన 'హలో' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన కళ్యాణి, తొలి సినిమాతోనే మంచి గుర్తింపు పొందారు. ఆ తర్వాత సాయి ధరమ్ తేజ్‌తో నటించిన 'చిత్రలహరి' బాక్సాఫీస్ వద్ద విజయం సాధించగా, శర్వానంద్ సరసన చేసిన 'రణరంగం' ఆశించిన విజయాన్ని అందించలేకపోయింది. టాలీవుడ్‌లో కేవలం మూడు సినిమాలు మాత్రమే చేసినప్పటికీ, ఆమె పాత్రలకు ప్రేక్షకుల నుంచి మంచి ప్రశంసలు లభించాయి.

ప్రస్తుతం మలయాళంలో వరుస విజయాలతో దూసుకుపోతున్న ఈ కథానాయిక, స్క్రిప్ట్ ప్రాధాన్యత ఉన్న మంచి పాత్ర లభిస్తే తెలుగులో మళ్లీ అలరించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సోషల్ మీడియాలో నిరంతరం క్రియాశీలకంగా ఉంటూ అభిమానులకు చేరువగా ఉండే కళ్యాణి, త్వరలోనే ఒక మంచి ప్రాజెక్ట్‌తో తెలుగు ప్రేక్షకుల ముందుకు రానున్నట్లు సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# సదా భావోద్వేగ వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబరు 23 : 'జయం' చిత్రంతో తెలుగు ప్రేక్షకుల మనసుల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న కథానాయిక సదా, తన సినీ ప్రయాణంలోని ఒడుదొడుకులు మరియు బుల్లితెర ప్రదర్శనల గురించి పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆమె, సినీ పరిశ్రమలో సరైన మార్గదర్శకత్వం లేకపోవడం వల్ల కొన్ని అవకాశాలను కోల్పోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.నితిన్ నటించిన చిత్రంలో 'రాను రాను అంటుందో చిన్నదో' పునర్నిర్మిత గీతం కోసం తనను సంప్రదించడానికి నిర్మాతలు ప్రయత్నించినట్లు తెలిసినప్పటికీ, ఆ వార్త తన వరకు రాలేదని, మధ్యలో ఆఫర్లను ఎవరు అడ్డుకుంటున్నారో అర్థం కావడం లేదని స్పష్టం చేశారు. 'ఢీ' నృత్య ప్రదర్శనకు వరుసగా మూడేళ్ల పాటు న్యాయనిర్ణేతగా వ్యవహరించిన తర్వాత ఒకే రకమైన శైలి అనిపించడంతోనే విరామం తీసుకున్నానని ఆమె తెలిపారు. తమిళంలో చేసిన 'టార్చ్ లైట్' చిత్రంలో మహిళా ప్రాధాన్యత ఉన్న కథ కావడంతోనే సాహసంతో ఆ పాత్ర చేశానని, అయితే ప్రేక్షకులు దాన్ని కథగా కాకుండా తన పాత్రను ప్రశ్నించడం దిగ్భ్రాంతికి గురిచేసిందని పేర్కొన్నారు. సినిమాలకు దూరమైనప్పటికీ ప్రేక్షకులు చూపుతున్న ఆదరణ పట్ల ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



# కుటుంబానికే నిషా ప్రాధాన్యత

హైదరాబాద్, సెప్టెంబరు 23 : సినీ పరిశ్రమలో వారసత్వంగా అడుగుపెట్టి తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటీనటులలో నిషా అగర్వాల్ ఒకరు. స్టార్ కథానాయిక కాజల్ అగర్వాల్ సోదరిగా చిత్రసీమలోకి అడుగుపెట్టిన ఆమె, తక్కువ సమయంలోనే తన అందం, అభినయంతో ప్రేక్షకులను అలరించారు. 2010లో వరుణ్ సందేశ్ సరసన 'ఏమైంది ఈ వేళ' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమై తొలి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్నారు. ఆ తర్వాత 'సోలో', 'సుకుమారుడు', 'డీకే బోస్' వంటి చిత్రాలలో నటించి తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే కెరీర్ ఊపందుకుంటున్న సమయంలోనే వివాహ బంధంలోకి అడుగుపెట్టిన నిషా, ఆ తర్వాత మాతృత్వానికి ప్రాధాన్యతనిస్తూ నటనకు పూర్తిస్థాయిలో స్వస్తి చెప్పారు. అక్క కాజల్ అగర్వాల్ ఇప్పటికీ వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, నిషా మాత్రం కుటుంబ జీవితానికే మొగ్గు చూపారు. వెండితెరకు దూరమైనప్పటికీ, సోషల్ మీడియా వేదికగా నిరంతరం అభిమానులతో ముచ్చటిస్తూ తన విశేష క్రేజ్‌ను కొనసాగిస్తున్నారు.

Printed, Published and Owned by **V SAMPATH**, and Printed at Sharada Printers, H.No 1-6-6, Shastri Road, Karimnagar, Dist: Karimnagar -505001,Telangana State, and Published from 8-5-137, Gayathri Nagar, Karimnagar (Karimnagar District) 505001,Telangana State. **Editor: V SAMPATH. RNI NO : TELTEL/2023/89146** Email: shenarthimedia@gmail.com. Phone No: **9391343644**